


మూలపేట పోర్టు

పలాసలో మరో పారిశ్రామికవాడ

రాష్ట్రవ్యాప్తంగా సూక్ష్మ, చిన్న, మధ్య తరహా సంస్థలు (ఎంఎస్ఎంఈ) పారిశ్రామిక పార్కుల అభివృద్ధి పథకంలో భాగంగా పలాస మండలం రామకృష్ణాపురం రెవిన్యూ పరిధిలో 60.84 ఎకరాల్లో స్థలాలు కేటాయించారు. దీనికి ఈ నెల 8న ఎమ్మెల్యే గౌతు శిరీష శంకుస్థాపన చేసిన విషయం విధితమే. కొత్త పారిశ్రామిక పార్కుతో పలాస నియోజకవర్గంలో ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు పరిశ్రమలు స్థాపించుకోవడానికి మార్గం సుగమమైంది. కూటమి ప్రభుత్వం వచ్చిన ఏడాది కాకముందే పలాసలో మరో పారిశ్రామికవాడ ఏర్పాటుకు శ్రీకారం చుట్టడం సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది. ఇప్పటికే పలాస-కాశీబుగ్గ మునిసిపాలిటీ సమీపంలో ఇంగిలిగాం వద్ద పారిశ్రామికవాడ ఏర్పాటైన విషయం విధితమే. అనేకమంది జీడి, జీడి ఆయిల్ వ్యాపారాలు కొనసాగిస్తూ వందలాది మంది కార్మికులకు ఉపాధి కల్పిస్తున్నారు. కొత్త పారిశ్రామికవాడలో కూడా రూ.96కోట్ల ప్రతిపాదిత పెట్టుబడులతో 76 పరిశ్రమలు స్థాపించడానికి వీలుగా ప్లాట్లు కేటాయించారు. 1500 మందికి ప్రత్యక్షంగా, 500 మంది కార్మికులకు పరోక్షంగా ఉపాధి కల్పించడానికి ఇక్కడ పారిశ్రామికవాడను తీర్చిదిద్దనున్నారు. పరిశ్రమలు స్థాపించుకునేవారికి సింగిల్‌విండో ద్వారా అనుమతులతోపాటు బ్యాంకు రుణాలు ఇవ్వాలని నిర్దేశించారు. ప్లాస్టిక్ రీ సైక్లింగ్, ఇంజనీరింగ్ యూనిట్లు, ఫుడ్ ప్రాసెసింగ్, డ్రైవాష్ యూనిట్లు, ప్లాస్టిక్ ప్రొడక్ట్స్, పేపర్ ప్రొడక్ట్స్, ప్యాకింగ్ యూనిట్లతోపాటు జీడి పరిశ్రమలు ఏర్పాటవుతాయి. చిన్నపెట్టుబడిదారులకు ఈ పార్కులు ఎంతో వినియోగపడతాయి. పలాస జాతీయరహదారికి ఆనుకొని రామకృష్ణాపురానికి కిలోమీటరు దూరంలో ఈ పార్కును రూపొందించారు. పర్యావరణానికి హాని లేకుండా ఇక్కడ నెలకొల్పడం మరోవిశేషం. గత వైసీపీ ప్రభుత్వం పారిశ్రామికవాడకు రూపకల్పన చేసినా, 50 ఎకరాలు మాత్రమే మంజూరు చేసింది. కూటమి ప్రభుత్వం 60 ఎకరాల్లో రూపకల్పన చేసేలా ఎమ్మెల్యే గౌతు శిరీష కృషి చేశారు. ఇప్పటికే స్థల సేకరణ చేయడంతో కొత్త పారిశ్రామికపార్కుకు మార్గం సుగమమైందని యువ పారిశ్రామికవేత్తలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

పారిశ్రామికాభివృద్ధి దిశగా..

- మూలపేట పోర్టు పరిసరాల్లో గ్రీన్‌అమ్మోనియా ఉత్పత్తి పరిశ్రమ
- మూడు దశల్లో రూ.10వేల కోట్ల పెట్టుబడికి ఎంవోయూ
- పలాసలోనూ ఎంఎస్ఎంఈ పార్కు ఏర్పాటు

సంతబొమ్మాళి/ పలాస, మే 25(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం పారిశ్రామికాభివృద్ధి దిశగా అడుగులేస్తోంది. వైసీపీ ప్రభుత్వ హయాంలో పారిశ్రామికాభివృద్ధి పడకేసింది. పారిశ్రామిక వేత్తలకు ప్రోత్సాహం లభించక.. ఎటువంటి రాయితీలు వర్తించక.. చాలా పరి శ్రమలు మూతపడ్డాయి. ఎంతోమంది కార్మికులు ఉపాధికి దూరమయ్యారు. ఈ నేపథ్యంలో ఇటు కార్మికులకు ఉపాధితో పాటు.. అటు పారిశ్రామికవేత్తలను ప్రోత్స హించేలా ప్రస్తుత ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. పరిశ్రమల ఏర్పాటుకు కృషి చేస్తోంది. ఇందులో భాగంగా సంతబొమ్మాళి మండలం మూలపేట పోర్టు పరిసరాల్లో గ్రీన్ అమ్మోనియా ఉత్పత్తి పరిశ్రమ ఏర్పాటు చేయనుంది. అలాగే పలాసలో ఎంఎస్ఎంఈ ఏర్పాటుకు ఇటీవల శంకుస్థాపన కూడా చేసింది. ఇక్కడ మరో పారిశ్రామికవాడ ఏర్పాటు కానుండడంతో వేలాది మందికి ఉపాధి దక్కనుందని సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది.

మూలపేట పోర్టు పరిధిలో..

సంతబొమ్మాళి మండలంలోని మూలపేట గ్రీన్‌పోర్టు పనులు సాగుతున్నాయి. ఈ పోర్టును పారిశ్రామిక వాడగా తీర్చిదిద్దేందుకు కేంద్ర, రాష్ట్ర మంత్రులు కింజరాపు రామ్మోహన్‌నాయుడు, అచ్చెన్నాయుడు ప్రత్యేక ప్రణాళికలు సిద్ధం చేశారు. పోర్టు పరిసరాల్లో మరికొన్ని పరిశ్రమలు ఏర్పాటుకు కొన్ని సంస్థలు సిద్ధమవుతున్నాయి. ఇప్పటికే కొన్ని సంస్థల ప్రతినిధులు మేఘవరం, మరువాడ పరిధిలో ఉన్న భూములను పరిశీలించారు. మండలంలోని ఈస్ట్‌కోస్టు థర్మల్ పవర్‌ప్లాంట్ నిర్మాణం నిలిచిపోవడంతో అక్కడ ఉన్న 3300 ఎకరాలతోపాటు తంపర భూములు, ఉప్పు భూములు పదివేల ఎకరాలు సేకరించి పరిశ్రమల కోసం భూ బ్యాంక్ ఏర్పాటు చేయనున్నారు. దీనికోసం పలుమార్లు అధికారులతో కేంద్ర, రాష్ట్ర మంత్రులు సమీక్షించారు. పోర్టు నిర్మాణంతో రవాణా సౌకర్యాలు మెరుగుపడనున్నాయి. ఈ క్రమంలో ఈ ప్రాంతంలో పరిశ్రమలు ఏర్పాటుకు పలు సంస్థలు ముందుకు వస్తున్నాయి. ఇందులో భాగంగా రూ.10వేల కోట్లతో గ్రీన్ అమ్మోనియా పరిశ్రమ ఏర్పాటు కానుంది. నెదర్లాండ్‌లో నిర్వహించిన హైడ్రోజన్ సమిట్- 2025లో ఇటీవల ఇందుకు సంబంధించి భారత్‌కు చెందిన జునో జౌలె గ్రీన్ ఎనర్జీ ప్రైవేట్ లిమిటెడ్, జర్మనీ ఎనర్జీ ట్రేడింగ్ కంపెనీ అనుబంధ సంస్థ సెలెక్ట్ న్యూ ఎనర్జీస్ జీఎంబీహెచ్ సంస్థలు ఎంవోయూ కుదుర్చుకున్నాయి. ఏటా మిలియన్ టన్నుల గ్రీన్ అమ్మోనియా తయారు చేసేలా ప్లాంట్ ఏర్పాటు చేయాలని సంస్థలు నిర్ణయించాయి. దీని ద్వారా ఇక్కడ ఎలక్ట్రోలసిస్ ద్వారా 180వేల టన్నుల గ్రీన్ హైడ్రోజన్ కూడా ఉత్పత్తి కానుంది. ఈ ప్రాజెక్టును మూడు దశల్లో అభివృద్ధి చేయనున్నారు. ఇందుకోసం రూ.10వేల కోట్లు పెట్టుబడి పెట్టనున్నారు. సముద్ర నీటిని మంచినీటిగా మార్చే ప్లాంట్‌నూ ఇందులోనే ఏర్పాటు చేయనున్నారు. ఈ ఎంఓయూపై జేజే గ్రీన్ ఎనర్జీ సంస్థ సీఈవో రాయపాటి నాగశరత్, సెలెక్ట్ న్యూ ఎనర్జీస్ జీఎంబీహెచ్ ఎండీ ఫెలిక్స్‌డేంజర్ సంతకాలు చేశారు. ఈ పరిశ్రమ ఏర్పాటుతో వేలాది మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి అవకాశాలు కలుగనున్నాయి.


రామకృష్ణాపురంలో కొత్త పారిశ్రామిక పార్కుకు కేటాయించిన భూములు



పలాస: ఎంఎస్ఎంఈ పార్కు కోసం ప్రారంభించిన శిలాఫలకం..

అభివృద్ధి చెందాలన్నదే ఆకాంక్ష.



పలాస నియోజకవర్గం అభివృద్ధి చెందాలనే ఉద్దేశంతో పారిశ్రామిక వాడను తీసుకువచ్చాం. ఇది పూర్తిగా నిండిపోతే మరో పారిశ్రామికవాడకు మార్గం లభిస్తుంది. వ్యాపారులు ముందుకు వచ్చి పరిశ్రమలు స్థాపించి తద్వారా యువతకు ఉపాధి ఇవ్వాలని కోరుతున్నాం. ఇప్పటికే జీడి పరిశ్రమల ద్వారా వేలాది మంది కార్మికులకు ఉపాధి అవకాశాలు పొందుతున్నారు. కొత్త పరిశ్రమల స్థాపనతో కనీసం 1,500 మందికి ఉపాధి దొరుకుతుందని భావిస్తున్నాం.

-గౌతు శిరీష, ఎమ్మెల్యే, పలాస


ఎగుమతికి సిద్ధంగా ఉన్న సరుగుడు, నీలగిరి కర్రలు

గిట్టుబాటు ఏదీ?

- తగ్గిన సరుగుడు, నీలగిరి ధరలు
- ఆందోళనలో రైతులు

ఎచ్చెర్ల, మే 25(ఆంధ్రజ్యోతి): సరుగుడు, నీలగిరి ధరలు తగ్గుతుండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ప్రస్తుతం మార్కెట్లో ఉన్న ధరలు గిట్టుబాటు కాక దిగులు చెందుతున్నారు. జిల్లాలో ఎచ్చెర్ల, లావేరు, రణస్థలం, పొందూరు, జి.సిగడాం, శ్రీకాకుళం రూరల్, గార తదితర మండలాల్లో మెట్ట ప్రాంతాల్లో సరుగుడు, నీలగిరి విస్తారంగా సాగు (మిగతా 8వ పేజీలో..)

కేశవరావు మృతదేహం అప్పగింతపై సందిగ్ధం

టెక్కలి, మే 25(ఆంధ్రజ్యోతి): మావోయిస్టు అగ్రనేత చీఫ్ నంబాల కేశవరావు అలియాస్ బసవ రాజు మృతదేహాన్ని ఆయన బంధువులకు అప్పగింతపై సందిగ్ధం నెలకొంది. కోటబొమ్మాళి మండ లం జీయన్నపేటకు చెందిన మావోయిస్టు నేత కేశవరావు.. ఈ నెల 21న ఛత్తీస్‌గఢ్‌లోని నారాయణపూర్ అడవుల్లో ఎన్‌కౌంటర్‌లో మృతి చెందిన విషయం తెలిసిందే. కేశవరావు మృతదేహాన్ని అప్పగించాలని ఆయన తల్లి భారతమ్మ, సోదరుడు ఢిల్లేశ్వరరావు, పౌరహక్కుల సంఘ నేతలు హైకోర్టును ఆశ్రయించారు. హైకోర్టు ఉత్తర్వుల మేరకు కేశవరావు మరో సోదరుడు రాంప్రసాద్‌తో కలిసి మరో ముగ్గురు బంధువులు ఆదివారం ఛత్తీస్‌ఘడ్ రాష్ట్రం నారాయణపూర్‌లో మృతదేహాలున్న ఆసుపత్రి వద్దకు ఫ్రీజర్ వాహనంతో చేరుకున్నారు. అక్కడి పోలీసు అధికారులతో మాట్లాడి వారి వివరాలు, ఆధార్ కార్డులను అందించారు. అయితే సాయంత్రానికి కూడా కేశవరావు మృతదేహాన్ని అప్పగించలేదు. హైకోర్టు ఆదేశాలున్నా ఎందుకు ఇవ్వడం లేదో అర్థం కావడం లేదని వారు ఆవేదన చెందుతున్నారు. అయితే తెలంగాణ, ఆంధ్రా ప్రాంతాలకు చెందిన మావోయిస్టుల మృతదేహాలను పోలీసులు వారి బంధువులకు అప్పగించలేదని తెలిసింది. ఈ నేపథ్యంలో సోమవారం జీయన్నపేటలో కేశవరావు అంత్యక్రియలు నిర్వహణపై సందిగ్ధం నెలకొంది.

అరసవల్లిలో.. షరామామూలే

- ఆలయంలో యథాతథంగా సమస్యలు
- ఎండలోనే భక్తుల అవస్థలు
- అపరిశుభ్రంగా ఆలయ పరిసరాలు
- యథావిధిగా కొనసాగుతున్న వసూళ్లు

అరసవల్లి, మే 25 (ఆంధ్రజ్యోతి): అరసవల్లిలో ఆదిత్యాలయంలో భక్తులకు అవస్థలు తప్పడం లేదు. ఆదివారం ఆదిత్యుడి దర్శనానికి భక్తులు పోటెత్తారు. క్యూలైన్లు కిటకిటలాడాయి. ఆదివారం ఒక్కరోజే స్వామికి రూ.12,29,751 ఆదాయం లభించింది. ఇందులో టిక్కెట్ల అమ్మకం ద్వారా రూ.8,84,100, విరాళాల ద్వారా రూ.81,496, ప్రసాదాల అమ్మకం ద్వారా రూ.2,64,155 ఆదాయం వచ్చింది. కాగా.. ఇంత ఆదాయం సమకూరుతున్నా.. భక్తులకు కనీస సౌకర్యాలు కల్పించడంలో ఆలయ అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఇటీవల ఈవో భద్రాజీ కంటి శస్త్రచికిత్స నిమిత్తం 15 రోజుల సెలవుపై వెళ్లారు. విశాఖపట్నం శ్రీకనకమహాలక్ష్మి ఆలయ ఈవో శోభారాణి డిప్యూటేషన్‌పై అరసవల్లిలో విధులు నిర్వర్తించారు. వైశాఖమాసం కావడంతో భక్తుల తాకిడి దృష్ట్యా సమస్యలను గుర్తించి ఆమె ముందు జాగ్రత్త చర్యలను చేపట్టారు. పారిశుధ్య నిర్వహణతో పాటు భక్తులకు సౌకర్యాలు కల్పించారు. ప్రసాదాల పంపిణీ, టిక్కెట్ల విక్రయాలు, సిబ్బంది అక్రమ వసూళ్లపై ప్రత్యేక దృష్టి సారించి.. కట్టడి చేశారు. విధుల్లో నిర్లక్ష్యం వహించే సిబ్బంది పైనా ఆమె కఠినంగా వ్యవహరించారు. కాగా.. పాత ఈవో మళ్లీ మూడురోజుల కిందట విధుల్లో చేరడంతో.. పరిస్థితులు షరామామూలుగానే మారిపోయాయని భక్తులు ఆరోపిస్తున్నారు. ఆదివారం స్వామి దర్శనానికి వచ్చిన భక్తులకు యథావిధిగా ఇబ్బందులు ఎదురయ్యాయి. పారిశుధ్య నిర్వహణ అధ్వానంగా మారింది. ఆలయ పరిసరాల్లో ఎక్కడ చూసినా చెత్తాచెదారాలు దర్శనమిచ్చాయి. మరోవైపు దినసరి వేతన ఉద్యోగులు, సిబ్బంది ఇష్టారాజ్యంగా వ్యవహరించడంతో అవస్థలు తప్పలేదు. ఎప్పటిలాగానే ఆలయ దినసరి వేతన శానిటేషన్ ఉద్యోగి.. సోడా బండి అయితే రూ.200, ఐస్‌క్రీమ్ బండికి రూ.100, అలాగే మరుగుదొడ్ల వద్ద మనిషికి రూ.10 చొప్పున అక్రమ వసూలు చేశారు. ప్రతీ ఆదివారం ఇలా వేలాది రూపాయల అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నా, ఆలయ అధికారులు మాత్రం చర్యలు తీసుకోవడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు.


ఎండలో భక్తుల పాట్లు

ఎండలోనే క్యూలైన్లలో భక్తులు..

స్వామి ప్రత్యేక దర్శనానికి వచ్చే భక్తులు రూ.100 క్యూలైన్లలో ఎండలోనే నిలబడాల్సి వచ్చింది. అలాగే కేశఖండన శాల వద్ద కూడా భక్తులు మధ్యాహ్నం 12-30 గంటల సమయంలో ఎండలోనే నిల్చున్నారు. దీనిపై ఆలయ అధికారులు ఎటువంటి చర్యలు తీసుకోకపోవడం గమనార్హం. ఆలయం నుంచి బయటకు వచ్చే మార్గం అంతా యాచకులే ఉండడంతో భక్తులు అసహనానికి గురయ్యారు.

ఒకరి భోజనం ముగ్గురికి సర్దుబాటు..

స్వామి అన్నప్రసాదాలను భక్తులు ఎంతో పవిత్రంగా స్వీకరిస్తుంటారు. ఒక్కో భక్తుడికి రూ.50చొప్పునఅన్నప్రసాదంపై ఖర్చు పెడుతుంటారు. కానీ ఆదివారం నాటి అన్నప్రసాదం వడ్డింపులో మాత్రం ప్లేటులో కనీస పరిమాణంలో కూడా ఆహార పదార్థాలు వడ్డించలేదు. ఒకరికి భోజనం ముగ్గురికి సర్దుబాటు చేసేలా వడ్డన జరిగింది. అన్నదాన వ్యవహారంలో నిత్యం వేలాది రూపాయలు చేతులు మారుతున్నట్లు గుసగుసలు వినిపిస్తున్నాయి. దీనిపై ఆలయ అధికారులు దృష్టి సారించాలని, సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టాలని భక్తులు కోరుతున్నారు. ఈ విషయమై ఈవో భద్రాజీ వద్ద ప్రస్తావించగా.. సమస్యలపై తక్షణ చర్యలు తీసుకుంటామని తెలిపారు. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ఏర్పాట్లు చేస్తామన్నారు. అక్రమ వసూళ్లకు పాల్పడితే సహించేది లేదని హెచ్చరించారు.


అరసవల్లిలో భక్తులతో కిటకిటలాడుతున్న క్యూలైన్లు

బాలింతలకు తీపికబురు

- మళ్లీ అందుబాటులోకి బేబీ కిట్లు
- పథకం పునరుద్ధరించాలని ప్రభుత్వ నిర్ణయం
- 11 రకాల వస్తువుల పంపిణీకి ఏర్పాట్లు

హిరమండలం/ నరసన్నపేట, మే 25(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసవించే బాలింతలకు ప్రభుత్వం తీపికబురు అందించింది. బేబీకిట్లు పథకం పునరుద్ధరించాలని నిర్ణయించింది. ఈమేరకు బాలింతలకు 11 రకాల వస్తువులను బేబీకిట్ల రూపంలో అందజేసేందుకు సన్నాహాలు చేస్తోంది. జిల్లాలో ప్రభుత్వ ఆస్పత్రులు, పీహెచ్‌సీల్లో ఏడాదికి సుమారు 12వేల ప్రసవాలు జరుగుతున్నాయి. ప్రభుత్వ ఆస్పత్రులకు పేద, మధ్య తరగతి కుటుంబాల వారే అధికంగా వస్తుంటారు. శిశువులను శుభ్రం చేసేందుకు పాతవస్త్రాలు వినియోగిస్తారు. దీనివల్ల శిశువులకు ఇన్‌ఫెక్షన్లు, రోగాలు ప్రబలే ప్రమాదం ఉంది. ఈ నేప థ్యంలో తల్లీబిడ్డ ఆరోగ్యం దృష్ట్యా టీడీపీ ప్రభుత్వం 2016 జూలై 1న ఎన్టీఆర్ బేబీకిట్ల పథకాన్ని ప్రారంభించింది. ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసవించిన బాలింతలకు కిట్ల రూపంలో చిన్నారులకు సంబంధించిన వస్తువులను అందజేసింది. 2019లో అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం ఈ పథకానికి డా.వైఎస్సార్ బేబీకిట్‌గా పేరు మార్చింది. రెండేళ్లపాటు ఈ పథకాన్ని కొనసాగించింది. కానీ, నిధుల మంజూరుకు ఆర్థికశాఖ కొర్రీలు చూపుతోందనే సాకుతో 2021 నుంచి ఈ పథకాన్ని పూర్తిగా నిలిపివేసింది. అప్పటి నుంచి బాలింతలపై అదనపు భారం పడుతోంది. ఈ నేపథ్యంలో ఈ పథకాన్ని పునరుద్ధరిస్తూ ప్రభుత్వం ఇటీవల జీవోనెంబర్ 61 విడుదల చేసింది. ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసవించిన బాలింతలకు రూ.1,410 విలువ చేసే కిట్‌ను అందజేయనుంది. దోమతెర, బేబీబెడ్, వాటర్‌ప్రూఫ్ కాట్, బేబీడ్రెస్, వాష్‌బుల్ న్యాపకిన్స్, టవల్, పౌడర్, షాంపూ, ఆయిల్, సబ్బు, సోప్‌బాక్స్ రాటిల్‌టాయ్స్ వంటి 11 రకాల వస్తువులు ఇవ్వనుంది. తద్వారా ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసవాల సంఖ్య పెరిగే అవకాశం ఉందని పలువురు అభిప్రాయపడుతున్నారు.



పేకాటరాయుళ్ల పట్టివేత

శ్రీకాకుళం రూరల్, మే 25(ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళం మండలంలో పేకాట రాయుళ్లు పట్టుబడ్డారు. కళ్లేపల్లి గ్రామ శివారులో జీడితోటలో ఆదివారం సాయంత్రం పేకాట స్థావరంపై రూరల్ పోలీసులు దాడులు చేశారు. ఇందులో ఆరుగురు పట్టుబడ్డారు. వారి నుంచి రూ.84వేలు నగదు, మూడు బైక్‌లు, ఐదు ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రాము వెల్లడించారు. అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడినవారిపై కఠినచర్యలు తీసుకుంటామని తెలిపారు.

ఈ మలుపులు ప్రమాదాలకు పిలుపు

- అలికాం-బత్తిలి రహదారిలో కానరాని హెచ్చరిక బోర్డులు
- గార మండలంలోనూ అదే పరిస్థితి

7లో

చేపలవేటకు వెళ్లి..

- మత్స్యకారుడి మృతి
- రాజారాంపురంలో విషాదం

పోలాకి, మే 25(ఆంధ్రజ్యోతి): పోలాకి మండలం రాజారాంపురానికి చెందిన దవులపిల్లి గురుమూర్తి(52).. గ్రామానికి సమీపంలో ఉన్న వంశధార ఉప్పుగెడ్డలో చేపల వేటకు వెళ్లి మృతి చెందాడు. శనివారం రాత్రి చిన్నపడవతో గురుమూర్తి వంశధార ఉప్పుగెడ్డలో చేపలవేటకు వెళ్లాడు. ఎప్పటికీ బయటకు రాకపోవడంతో తోటి మత్స్యకారులు గాలించారు. ఆదివారం ఉదయం 9గంటల సమయంలో గురుమూర్తి విగతజీవిగా కనిపించాడు. దీంతో భార్య నీలవేణి, కుటుంబ సభ్యులు బోరున విలపించారు. ఎస్ఐ రంజిత్‌కుమార్, సీఐ ఎం.శ్రీనివాసరావు సంఘటనా స్థలానికి చేరుకుని ఘటనపై ఆరా తీశారు. కాగా ప్రమాదం ఎలా జరిగిందో తెలియదని కుటుంబ సభ్యులు, మాజీ ఎంపీటీసీ, మైలపల్లి త్రినాథరావు, కొమర ఎర్రయ్య, కోడ తాతారావు తదితర మత్స్యకారులు తెలిపారు. బోటు బోల్తా పడి ఊబిలో చిక్కుకుని ప్రాణాలు కోల్పోయి ఉంటాడని పలువురు అనుమానం వ్యక్తం చేశారు. మృతదేహానికి వీఆర్వో వై.లక్ష్మణరావు, సాగరమిత్ర పుష్పలత, సచివాలయ సిబ్బంది గ్రామపెద్దల సమక్షంలో పంచనామా చేశారు. పోస్టుమార్టం నిమిత్తం నరసన్నపేట ఆస్పత్రికి మృతదేహాన్ని తరలించారు. ఈ ఘటనతో గ్రామస్థులు విషాదంలో మునిగిపోయారు.


గురుమూర్తి మృతదేహం వద్ద రోదిస్తున్న భార్య నీలవేణి, కుటుంబ సభ్యులు

SCHOLARSHIP ALERT

Satya Scholarship Program

Description: The Nehru Sidhant Kender Trust invites applications from Class 12 graduates who have scored at least 60% and are pursuing undergraduate (UG) or integrated master's programs at selected colleges/universities (Institutes) located in Ludhiana district. With full tuition coverage, this scholarship is dedicated to empowering bright, deserving students from diverse socio-economic backgrounds, helping them turn aspirations into achievements and build a future without financial barriers.

Eligibility: Open to students pursuing 3-5 year UG/integrated master's courses in eligible courses of Commerce (BBA, BCom), Engineering (BTech, B.E., B.Sc. (Engineering), BCA, B.Arch.), and Medical (MBBS, BDS, BPT, B.Sc. (Nursing), B.Sc. (Paramedics)) from select colleges/universities (Institutes) located in Ludhiana district.

- Must have passed Class 12 board exams from Ludhiana district with a minimum of 60% marks.
- Annual parents' income must not exceed INR 5 Lakh from all sources. In case of orphan students, the guardian's income should be less than INR 5 Lakh.
- Preference given to girls, athletes (state/national/international level), persons with disabilities, orphans, and children of single parents.
- Should not be a recipient of any other educational scholarship.

Prizes & Rewards: 100% tuition fee coverage for the entire course duration.

- Hostel and mess charges may be considered on a case-by-case basis if campus residence is mandatory.
- Reimbursement of partial or full tuition fees paid in the first year, transferred directly to the student's or parent's account.

Last Date to Apply: 31-07-2025
Application mode: Online applications only
Short Url: www.b4s.in/aj/SAT1

Mirae Asset Foundation Scholarship Program

Description: Mirae Asset Foundation invites applications from students who are currently pursuing undergraduate or postgraduate courses across India.

Eligibility: Open to students who are currently pursuing undergraduate or postgraduate courses across India. Applicants must have scored at least 60% in the previous academic year. The annual family income of the applicants must not exceed INR 8,00,000.

Prizes & Rewards: Scholarships up to INR 50,000
Last Date to Apply: 20-06-2025
Application mode: Online applications only
Short Url: www.b4s.in/aj/MAFS3



దిక్సూచి
DIKSUCHI

ఐఐటీ మినహా మిగిలిన ఇంజనీరింగ్ కోర్సుల్లో చేరేందుకు ఉద్దేశించిన ప్రవేశ పరీక్షల ఫలితాలు వెల్లడయ్యాయి. ఐఐటీ, ఎన్ఐటీ లేదంటే రాష్ట్ర స్థాయి సెట్‌లో సాధించిన ర్యాంకుతో కోరుకున్న కాలేజీలో సీటు వచ్చే విద్యార్థులకు ఎలాంటి ఇబ్బంది లేదు. మంచి ర్యాంకు పొందిన వారికి పేరున్న సంస్థలోనే సీటు వస్తుంది. మధ్యస్థంగా ర్యాంకు వచ్చిన విద్యార్థులకే అసలైన కష్టం. కాలేజీ ఎంపికలో వారంతా చాలా జాగ్రత్తగా వ్యవహరించాలి. అలాగే ఒకసారి చేరిన తరవాత నాలుగేళ్లు చదవాలి. ఆపై సమున్నత కెరీర్ నిర్మించుకోవాలి. భావి జీవితం బాగా ఉండాలంటే, ముందస్తు కసరత్తు చాలా అవసరం. అసలు తెలుగు రాష్ట్రాల్లో ఉన్న ఇంజనీరింగ్ కాలేజీల్లో ఏది మంచిదన్న ప్రశ్నతో ఈ ప్రక్రియ మొదలవుతుంది.

ఇంజనీరింగ్ కాలేజీ ఎంపికలో ఏవి కీలకం?

సాధారణంగా చాలా మంది విద్యార్థులు ఎంపిక విషయానికి వచ్చే సరికి ఓ పది ఇంజనీరింగ్ కాలేజీలను ఉజ్జాయింపుగా ఎంచుకొంటారు. ఆ క్రమంలోనే అక్కడి క్యాంపస్ రిక్రూట్‌మెంట్లు జరిగిన తీరుతెన్నులు, వార్షిక ప్యాకేజీ వివరాలు తెలుసుకుంటారు. వాటికి తోడు మరో రెండు అంశాలనూ పరిశీలించాలి. పేరున్న కాలేజీల్లో నాణ్యమైన విద్య లభిస్తుంది. ఏ కాలేజీలో ఎలాంటి విద్యను అందిస్తున్నారో, వాటి ప్రమాణాలు ఏమిటో క్యాంపస్ ప్లేస్‌మెంట్ కోసం వచ్చే సంస్థలకు స్పష్టమైన అవగాహన ఉంటుంది. అసలు అలాంటి కాలేజీలకే వారు వెళ్తారు.

బ్రాండ్ ఇమేజ్

సాధారణంగా పేరున్న కాలేజీలు(బ్రాండ్ ఇమేజ్) అనగానే ఐఐటీ లాంటివి గుర్తుకు వస్తాయి. అక్కడ నాణ్యమైన విద్య లభిస్తుంది. పూర్వ విద్యార్థుల ప్రతిభ, అక్కడి ప్రొఫెసర్లు - విద్యార్థుల పరిశోధనలు ప్రామాణికంగా ఉంటాయి. మరికొన్ని కాలేజీలకూ బాగానే పేరుంటుంది. అవి ప్రామాణికాంశాలతో కాకుండా తమ ప్రచారంతో సంపాదించినవి. చిన్న కాలేజీలు, కొత్తగా ఏర్పాటైనవి ఆ స్థాయిలో ప్రచారానికి వ్యయం చేయలేవు. అందుకే కొన్ని చిన్న కాలేజీలు నాణ్యమైన విద్యను అందించినా ఆ స్థాయి ప్రచారాన్ని అందుకోలేక 'వెనుకబాట' పడతాయి. అందువల్లే కొత్త, చిన్న కాలేజీలు రిక్రూటర్లను పెద్దగా ఆకర్షించలేవు.

ఫ్యాకల్టీ

ఒక కాలేజీలోని ఫ్యాకల్టీ విద్యార్హతలు ఏమిటన్నది తప్పక పరిశీలించాలి. మొత్తం అధ్యాపకుల్లో పిహెచ్‌డి ఎంత మందికి ఉందన్నది తెలుసుకోవాలి. ఆ డిగ్రీ లేనప్పటికీ కొందరు మంచి అధ్యాపకులు ఉంటారు. అయితే, వారి సంఖ్య స్వల్పం. ఎం.టెక్ పూర్తి చేసిన వారు ఎందరున్నారన్నదీ పరిశీలించాలి. ఎందుకంటే, ఇటీవల చాలా కాలేజీల్లో బీ.టెక్ లేదంటే ఎమ్మెస్సీ పూర్తి చేసిన వారిని అధ్యాపకులుగా నియమిస్తున్నారు. అలాంటి కాలేజీల్లో నాణ్యమైన విద్యను ఆశించలేం. అధ్యాపకులు వారి ఉన్నత విద్యను ఎక్కడ పూర్తి చేశారన్నదీ చూడాలి. ప్రముఖ సంస్థల్లో విద్యాభ్యాసం చేసిన వారి నుంచి నాణ్యమైన విద్య తప్పకుండా లభిస్తుంది. అలాగే ఆ కాలేజీలో బీటెక్ వరకు చదివి, తదనంతరం ఉన్నత విద్యను ప్రతిష్ఠాత్మక సంస్థల్లో పూర్తి చేసుకొని ఉంటే ఆలోచించాల్సిన అవసరం లేదు.

అధ్యాపకుల సంఖ్య

నాణ్యమైన విద్యను పొందేందుకు అధ్యాపక- విద్యార్థి నిష్పత్తి అతి ముఖ్యమైంది. విద్యార్థుల సగటు సంఖ్య తక్కువగా ఉండే తరగతి గదుల్లో నాణ్యమైన విద్య లభిస్తుంది. అంటే సరిపడా అధ్యాపకులున్న కాలేజీల్లో మాత్రమే తరగతి గదిలో విద్యార్థుల సగటు సంఖ్య తక్కువగా ఉంటుంది. అలా కాకుండా విద్యార్థుల సంఖ్యతో పొంతన లేకుండా అధ్యాపకులు తగ్గిన పక్షంలో అది వారి పని భారాన్ని పెంచుతుంది. దాంతో వారు స్వీయ పరిశోధనకు సమయం కేటాయించుకోలేరు. సరైన రీతిలో అసైన్‌మెంట్లను, ప్రాజెక్టు వర్క్‌ను విద్యార్థులకు ఇవ్వలేరు. అలాగే వాటికి గ్రేడింగ్ ఇవ్వడమనేది వారికి అత్యంత భారంగా మారుతుంది.

పరిశోధనల తీరుతెన్నులు..

కాలేజీ అధ్యాపకులు ఎవరైనా పరిశోధన చేస్తుంటే వారికి సదరు రంగాల్లో వస్తున్న మార్పులపై సరైన అవగాహన ఉంటుంది. వారు మంచి బోధనను అందిస్తారు. గొప్పగొప్ప సంస్థల్లో పరిశోధన కొనసాగిస్తున్న వారే కానవసరం లేదు. పరిశోధన రంగంలో ఉంటే బాగా బోధిస్తారని అంచనా వేయవచ్చు. పరిశోధనకు పూర్తిగా దూరంగా ఉండే వారి నుంచి మాత్రం ఉత్తమ బోధనను ఆశించడం కష్టమే. వీలైతే మొత్తం కాలేజీ కార్యక్రమాలను లేదా కనీసం తాము ఎంచుకోవాలని భావించే శాఖ పనితీరును చూడాలి. సెమినార్లు, వర్క్‌షాప్‌లు నిర్వహిస్తున్నారా అవి విషయాన్నీ చూడాలి.

వసతులు

ఇది మరో ముఖ్యమైన అంశం. చేరాలనుకునే విభాగంలో ల్యాబ్‌ల పరిస్థితి ఎలా ఉందో తెలుసుకోవాలి. ఆధునిక పరికరాలు ఉన్నాయా? ఉంటే విద్యార్థులంతా ఒకేసారి ప్రయోగాలు చేసేందుకు సరిపడా ఉన్నాయా? లేకుంటే ఏదో మొక్కుబడిగా డిమాన్‌స్ట్రేటర్ చేసి చూపిస్తారా అన్నవి తెలుసుకోవాలి. మొత్తంగా కాలేజీలో వసతులు ఎలా ఉన్నాయో పరిశీలించాలి. విద్యార్థుల సంఖ్యతో పోల్చినప్పుడు సగటున ఎన్ని పుస్తకాలు లైబ్రరీలో ఉన్నాయో కనుక్కోవాలి. లైబ్రరీకి 'ఈ-జర్నల్స్' ఎన్ని అందుబాటులో ఉన్నాయి? ఎంత తలసరి బ్యాండ్ విడ్త్ ఉంది? తరగతి గదిలో కంప్యూటర్లు, ప్రొజెక్టర్లు, స్క్రీన్‌లు, ఆడియో సౌకర్యం ఉందా? క్రీడల నిర్వహణ ఎలా ఉంది లాంటి అంశాలను కేవలం ఆ కాలేజీల వెబ్‌సైట్ల నుంచి మాత్రమే పొందలేం. అందు కోసం ప్రస్తుత లేదా తెలిసిన నమ్మకమైన పూర్వ విద్యార్థులతోనైనా సంభాషించడం ఉత్తమం. వీలైతే వాటి పరిశీలనకు ఆ కాలేజీని సందర్శించడం మరో మార్గం.

ఇవీ ముఖ్యమే

సంస్థ స్థితి: ఆ సంస్థకు యూనివర్సిటీ స్థాయి ఉండే పక్షంలో అక్కడ కొత్త ఆలోచనలకు, అకడమిక్ స్వేచ్ఛకు ఎక్కువ అవకాశం ఉంటుంది. ఎంతకాలంగా మనుగడలో ఉందన్నదీ ముఖ్యమే.

క్యాంపస్: పూర్తి రెసిడెన్షియల్ క్యాంపస్ అయితే నేర్చుకొనే వాతావరణం అధికంగా ఉంటుంది.

కరికులమ్: సిలబస్‌ను తరచుగా మారుస్తున్నారా? అక్కడ ఎన్ని కోర్సులు అందుబాటులో ఉన్నాయి? వంటివీ తెలుసుకోవాలి. కొన్ని సంస్థల్లో అనేక కోర్సులుంటాయి. అయితే బోధన బాగా ఉండకపోవచ్చు.

పాఠ్య ప్రణాళిక ఎంపిక: అక్కడ ఎన్ని ఎలక్టివ్స్ అందుబాటులో ఉన్నాయి? అవి ఉద్యోగాలకు పనికి వచ్చేవా లేక ఉన్నత విద్యాభ్యాసానికి ఉపకరించేవా? ఆ సంస్థలోని విద్యార్థులు ఎక్కువగా ఉన్నత విద్యకు వెళ్తున్నారంటే - అక్కడ మంచి అభ్యసన వాతావరణం ఉన్నట్లే!

పోటీ పరీక్షలు: అక్కడి విద్యార్థులు గేట్/క్యాట్ లాంటి పరీక్షల్లో చూపిన ప్రతిభనూ గమనించాలి.

మనుగడ: ఆ కాలేజీ పది పదిహేనేళ్లుగా మనుగడలో ఉంటే, దాని పూర్వ విద్యార్థుల సంఘం ఉందా? ఉంటే మంచిది. లేదంటే.. ఆ కాలేజీని వారే పట్టించుకోనప్పుడు మనం ఎంచుకోవాల్సిన అవసరం ఉందా? అనేది నిర్ణయించుకోవాలి.

క్యాంపస్ ప్లేస్‌మెంట్: దీనిని పరిగణించాల్సిందే. కానీ ఈ ఒక్కదాన్నే పరిగణనలోకి తీసుకోవడం మాత్రం సరికాదు.

విద్యార్థుల కార్యక్రమాలు: నాలుగేళ్లు కేవలం తరగతి గది, ల్యాబ్‌లకే అంకితం కాలేము. కాబట్టి ఆ కాలేజీలో ఎక్స్‌ట్రా కరిక్యులర్ యాక్టివిటీస్ ఎలా నిర్వహిస్తున్నారో తెలుసుకోవాలి.

విద్యార్థి భాగస్వామ్యం: కళాశాల నిర్వహణలో విద్యార్థులకు భాగస్వామ్యం కల్పిస్తే - అది వారిలోని నాయకత్వ లక్షణాలను వెలికితీస్తుంది. కాబట్టి దానినీ పరిశీలించాలి.

- ఇంత సమాచారం కనుగొనడం చాలా కష్టమని మీరు భావించవచ్చు. అయితే అన్ని కాలేజీల సమాచారం సేకరించాల్సిన అవసరం లేదు. కేవలం మీరు ఎంచుకోవాలని భావించే కాలేజీల గురించి సేకరిస్తే చాలు. అప్పుడు అదంత కష్టం కాబోదు. కాలేజీ వెబ్‌సైట్ కూడా ఈ విషయంలో తోడ్పడుతుంది. అందులో సమాచారం మరీ తక్కువగా ఉంటే ఆలోచించాలి. ప్రతి ఒక్కరిలో సహజ మేధస్సు అంతర్లీనంగా ఉంటుంది. అది వికసించేందుకు భౌతిక వాతావరణం తోడవ్వాలి. కుటుంబ నేపథ్యం, ఉత్తమ సహచర్యం, లక్ష్యం, ఆ దిశలో పయనం లాంటివి వికాసానికి తోడ్పడుతాయి తప్ప ఏదో ఒక కాలేజీలో విద్యాభ్యాసం చేయడం మూలంగానే అన్నీ సాధ్యం కావు. అలా అని కాలేజీ ప్రాధాన్యం తగ్గించలేం. మంచి కాలేజీలోనే విద్యార్థి ప్రతిభ వికసిస్తుందన్నది నిగ్గుతేలిన నిజం. విద్యార్థి దశలోనే అవగాహన, విశ్లేషణ, అన్వయం అనేవి అలవడతాయి.

చిత్రజ్యోతి
★ SINCE 1965 ★

పదవుల కోసం రాజకీయాల్లోకి రాలేదు

-కమల్ హాసన్



పదవుల కోసమో, ముఖ్యమంత్రిని అవ్వాలనే కోరికతోనో రాజకీయాల్లోకి రాలేదని సినీ నటుడు, మక్కల్ నీది మయ్యం (ఎంఎన్ఎం) అధ్యక్షుడు కమల్ హాసన్ స్పష్టంచేశారు. మణిరత్నం దర్శకత్వంలో ఆయన హీరోగా నటించిన 'థగ్‌లైఫ్' చిత్రం ఆడియో రిలీజ్ కార్యక్రమంలో మాట్లాడుతూ, 'సీఎం కావాలన్న ఉద్దేశంతో రాజకీయాల్లోకి రాలేదు. రాష్ట్ర ప్రజలకు, నా అభిమానులకు సేవ చేయాలన్న ఉద్దేశంతో వచ్చాను. అనుకున్న లక్ష్యాన్ని నిదానంగా సాధిస్తాం. ఈ ప్రయాణంలో నాతో భాగమైన వారికి ధన్యవాదాలు. 'థగ్‌లైఫ్'ను ప్రేక్షకులు తప్పకుండా ఆదరిస్తారన్న నమ్మకం ఉంది. మేము ఒక మంచి చిత్రాన్ని నిర్మించాం. అందుకే శాటిలైట్, ఓటీటీ హక్కులు మాత్రమే విక్రయించాం. సినిమాపై ఉన్న నమ్మకంతో మేమే డిస్ట్రిబ్యూషన్ చేస్తున్నాం. ఇలాంటి మంచి చిత్రాన్ని ప్రేక్షకులు ఆదరిస్తే, మా బేనరులో ఎన్నో గొప్ప చిత్రాలను రూపొందిస్తాం' అని పేర్కొన్నారు. -చెన్నై, ఆంధ్రజ్యోతి

ఆ నలుగురిలో నేను లేను

- అల్లు అరవింద్

"రెండు రోజుల నుంచి మీడియాలో 'ఆ నలుగురు... ఆ నలుగురు' అంటూ కొంచెం నెగిటివ్ టచ్ ఇచ్చి పదే పదే చెబుతున్నారు. 'కబంద హస్తాలతో థియేటర్లను గుప్పిట పట్టార'ని అంటున్నారు. ఆ నలుగురిలో నేను లేను. ఆ నలుగురితో నాకు సంబంధం లేదు" అని నిర్మాత అల్లు అరవింద్ అన్నారు. పర్సంటేజీ విధానం అమలు చేయకుంటే జూన్ 1 నుంచి థియేటర్ల మూసివేస్తాం అంటూ ఎగ్జిబిటర్లు కొన్ని రోజుల క్రితం ప్రకటించిన విషయం తెలిసిందే. ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ నటించిన హరిహర వీరమల్లు సినిమా విడుదలను అడ్డుకోవడానికి తెరవెనుక కొందరు సినీ పెద్దలు ప్రయత్నిస్తున్నారనీ, ఈ నిర్ణయం వెనుక ఉన్న ఆ నలుగురిలో అల్లు అరవింద్ హస్తం ఉందంటూ మీడియాలో ఉధృతంగా ప్రచారం జరుగుతోంది. ఈ నేపథ్యంలో తనపై వస్తున్న ఆరోపణలపై వివరణ ఇచ్చేందుకు అల్లు అరవింద్ ఆదివారం మీడియా ముందుకొచ్చారు.

"ఆ నలుగురు' అని అనడం 15 ఏళ్ల క్రితం మొదలుపెట్టారు. కొవిడ్ సమయంలోనే ఆ నలుగురి వ్యాపారంలోంచి నేను బయటకు వచ్చాను. తెలంగాణలో నాకు ఉన్న ఏకైక థియేటర్ 'ఏఏఏ'. అది తప్ప నాకు మరో థియేటర్ లేదు. అలాగే ఒక్క థియేటర్ కూడా తెలంగాణలో నాకింద లీజులో లేదు. ఆంధ్రాలో 15 థియేటర్లు లీజులో నడుపుతున్నాం. గడువు తీరాక వాటిని కూడా వదులుకోవాలనుకుంటున్నాం. పాత అలవాటు ప్రకారం అందరూ నన్ను కూడా ఆ నలుగురిలో కలుపుతున్నారు. ఇకపై దయచేసి ఆ నలుగురి గురించి చెప్పేటప్పుడు అందులో నన్ను కలపొద్దు' అని అల్లు అరవింద్ కోరారు.



ఆ సమావేశాల్లో నేను పాల్గొనలేదు


'థియేటర్ల మూసివేతపై నిర్వహించిన సమావేశాల్లో నేను పాల్గొనలేదు. 'మేం థియేటర్లు మూసేస్తున్నాం, మీరు చర్చలకు రండి' అని అనడం నాకు నచ్చలేదు. అది ఏకపక్ష నిర్ణయం. మా వాళ్లకు కూడా వెళ్లొద్దు అని చెప్పాను. ఏదైనా సమస్య ఉంటే ముందు ఛాంబర్‌లో, గిల్డ్‌లో చర్చించి పరిష్కరించుకోవాలి. కుదరకపోతే ప్రభుత్వాన్ని కూడా కలవాలి. అన్నీ దారులు మూసుకుపోతే అప్పుడు థియేటర్ల బంద్ నిర్ణయం తీసుకొని ఉండాల్సింది. అలాగే క్యూబ్‌లో నేను, యూఎఫ్ఓలో సురేశ్‌బాబు భాగస్వాములం కాదు' అని అల్లు అరవింద్ వివరణ ఇచ్చారు.

పవన్‌కల్యాణ్ ఆవేదనలో అర్థం ఉంది

"పవన్‌కల్యాణ్ ఆవేదనలో అర్థం ఉంది. ఆయన సినిమా వస్తుంటే మేం థియేటర్లు మూసేస్తున్నాం అనడం పవన్ కల్యాణ్‌ను బెదిరించడమే. ఆయన సినిమా విడుదలవుతున్న సమయంలో థియేటర్లను మూసేస్తాం అనే దుస్సాహసం చేయకూడదు. థియేటర్ల మూసివేతపై ఏపీ సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేశ్ స్పందన సమంజసమే. పవన్ కల్యాణ్ మన ఇండస్ట్రీ నుంచి వెళ్లారు. ఎవరికి ఏ సహాయం కావాలన్నా చేస్తున్నారు. అశ్వనీదత్ గారి సినిమా విడుదలైన సమయంలో టికెట్ ధరలను పెంచమని అడగడానికి మేం వెళ్లాం. 'ఛాంబర్ తరఫున వచ్చి సీఎం చంద్రబాబునాయుడు గారిని ఒకసారి కలవండి' అని ఆ సమయంలో పవన్ కల్యాణ్ చెప్పారు. ఆ తర్వాత ఏం జరిగిందో కానీ ఎవరూ ఆ విషయాన్ని పట్టించుకోలేదు. వెళ్లి కలసి ఉంటే బావుండేది" అని హితవు పలికారు.

> "మాది ప్రైవేట్ వ్యాపారం. ప్రభుత్వంతో మాకు సంబంధం లేదని కొందరు అంటున్నారు. అలాంటప్పుడు మనలో పెద్దపెద్దవాళ్లందరూ గత ప్రభుత్వంలో సీఎంను మాత్రం ఎందుకు కలవాల్సి వచ్చింది?"

ఓజీ విడుదల తేదీ వచ్చేసింది



పవన్‌కల్యాణ్ కథానాయకుడిగా సుజీత్ తెరకెక్కిస్తున్న చిత్రం 'ఓజీ'. డి.వి.వి.దానయ్య నిర్మిస్తున్నారు. ప్రియాంక మోహన్ కథానాయిక. బాలీవుడ్ నటుడు ఇమ్రాన్ హష్మీ ప్రతినాయకుడు. ఇందులో ఓజాస్ గంభీరా అనే శక్తిమంతమైన గ్యాంగ్‌స్టర్ పాత్రలో కనిపించనున్నారు పవన్. రాజకీయాల్లో బిజీగా ఉన్న ఆయన ఇటీవలె ఈ సినిమా షూట్‌లోకి అడుగుపెట్టారు. తాజాగా, ఈ సినిమా విడుదల తేదీని ఖరారు చేశారు మేకర్స్. దసరా సందర్భంగా సెప్టెంబర్ 25న ఈ చిత్రాన్ని విడుదల చేయనున్నట్లు తెలిపారు.

ట్రాన్స్ ఆఫ్ కుబేర



నాగార్జున, ధనుశ్, రష్మిక ప్రధాన పాత్రల్లో నటిస్తున్న చిత్రం 'కుబేర'. శేఖర్ కమ్ముల దర్శకత్వంలో సునీల్ నారంగ్, పుస్కూర్ రామ్ మోహన్‌రావు నిర్మిస్తున్నారు. తాజాగా, ఈ చిత్ర టీజర్‌ను 'ట్రాన్స్ ఆఫ్ కుబేర' అనే పేరుతో విడుదల చేశారు మేకర్స్ ప్రధాన పాత్రధారుల శక్తిమంతమైన లుక్స్ విజువల్స్ సంగీతం ఆకట్టుకున్నాయి. దేవిశ్రీ ప్రసాద్ సంగీతం అందిస్తున్న ఈ చిత్రం పాన్ ఇండియా రేంజ్‌లో జూన్ 20న విడుదలవుతోంది.

ముగిసిన కేన్స్ వేడుక.. విజేతగా ఇరానియన్ చిత్రం



ఈ నెల 13న అట్టహాసంగా ప్రారంభమైన 78వ కేన్స్ చిత్రోత్సవం శనివారం ముగిసింది. కేన్స్‌లో అత్యుత్తమ సినీ పురస్కారమైన 'గోల్డెన్ పామ్'ని అందుకోవడానికి ప్రపంచవ్యాప్తంగా పలు సినిమాలు పోటీపడగా... ఈ ఏడాది ఆ ఘనతను ఇరానియన్ దర్శకుడు జాఫర్ పనాహీ తెరకెక్కించిన 'ఇట్ వజ్ జస్ట్ యాన్ ఆక్సిడెంట్' చిత్రం అందుకుంది. ఈ చిత్రంలో వహీద్ మొబస్సెరీ, మరియమ్ అఫ్షారీ ప్రధాన పాత్రల్లో నటించారు. ఓ రోడ్ ట్రిప్ నేపథ్యంలో పలు మలుపులతో ఆసక్తికరంగా సాగే చిత్రమిది. 'అన్ సర్టెన్ రిగార్డ్' విభాగంలో 'మిస్టీరియస్ గేజ్ ఆఫ్ ది ఫ్లెమింగో' చిత్రం అవార్డు దక్కించుకుంది. 1980ల కాలంలో ఎయిడ్స్ వ్యాధిపై సమాజంలో ఉన్న మూఢనమ్మకాలపై పోరాడే 12 ఏళ్ల బాలిక కథాంశంతో తెరకెక్కిన ఈ సినిమా వీక్షకులను కదిలించింది. ఫ్రాన్స్ దర్శకుడు డియెగో సస్పెడెస్ తెరకెక్కించారు. అలాగే, మన దేశం నుంచి 'హోమ్ బౌండ్' అనే చిత్రం అన్‌సర్టెన్ రిగార్డ్‌లో ప్రదర్శితమైన సంగతి తెలిసిందే. ఈ ఏడాది భారత్ నుంచి ప్రదర్శనకు ఎంపికైన ఏకైక సినిమా ఇదే కావడం విశేషం. అయితే ఈ చిత్రానికి పురస్కారం దక్కలేదు. ఫ్రెంచ్ నటి జూలియట్ బినోచే.. భారతీయ దర్శకురాలు, 'ఆల్ వియ్ ఇమాజిన్ ఆజ్ లైట్' ఫేమ్ పాయల్ కపాడియా తదితరులు ఈ ఏడాది జ్యూరీ సభ్యులుగా వ్యవహరించారు.

ఈ వేడుకల ప్రారంభోత్సవంలో అలియా భట్ పాల్గొనాల్సి ఉండగా, భారత్-పాక్ ఉద్రిక్తతల నేపథ్యంలో ఆగిపోయారు. చివరి రోజు గూచి బ్రాండ్ చీరలో మెరిసి ప్రత్యేకాకర్షణగా నిలిచారు.



విజేతలు వీరే:

గోల్డెన్ పామ్: ఇట్ వజ్ జస్ట్ యాన్ ఆక్సిడెంట్ (జాఫర్ పనాహీ)
గ్రాండ్ ప్రిక్స్: ద సెంటిమెంటల్ వాల్యూ (జొవాచిమ్ ట్రియర్)
ఉత్తమ దర్శకుడు: క్లెబర్ మెన్‌డోన్సా ఫిల్హో (ద సీక్రెట్ ఏజెంట్)
ఉత్తమ నటుడు: వాఘ్నర్ మౌరా (ది సీక్రెట్ ఏజెంట్)
ఉత్తమ నటి: నదియా మెలిటీ (ది లిటిల్ సిస్టర్)
అన్‌సర్టైన్ రిగార్డ్: మిస్టీరియస్ గేజ్ ఆఫ్ ది ఫ్లెమింగో (డియెగో సస్పెడెస్)

కొత్తగా..

ప్రేక్షకుల్ని మెప్పిస్తుంది



నూతన నటీనటులతో దర్శకుడు గుణశేఖర్ తెరకెక్కిస్తున్న చిత్రం 'యుఫోరియా'. భూమికా చావ్లా, సారా అర్జున్, రోహిత్ కీలకపాత్రలు పోషిస్తున్నారు. ఇటీవలే చిత్రబృందం నిర్వహించిన కార్యక్రమంలో 'యుఫోరియా' నుంచి హై హై అంటూ సాగే గీతాన్ని విడుదల చేశారు. కిట్టు విస్సాప్రగడ సాహిత్యానికి కాలభైరవ స్వరాలు సమకూర్చడంతో పాటు పృథ్వీ చంద్ర, గాయత్రీ నటరాజన్‌తో కలసి ఆలపించారు. ఈ సందర్భంగా గుణశేఖర్ మాట్లాడుతూ 'ప్రేక్షకులు చూపించే ఎనర్జీయే 'యుఫోరియా'. ఇదే ఎనర్జీ సినిమాలోనూ ఉంటుంది. యూత్‌ఫుల్ బ్యాక్‌డ్రాప్‌లో ఈ సినిమా తీస్తున్నాను. తప్పకుండా ప్రేక్షకుల్ని మెప్పిస్తుంది' అన్నారు. నిర్మాత నీలిమ గుణ మాట్లాడుతూ 'హై హై పాట అందరికీ నచ్చుతుంది. ఇదొక విభిన్న చిత్రం' అన్నారు.

థియేటర్లలో చూడాల్సిన చిత్రం



అందమైన ప్రేమకథకు మిస్టరీ ఎలిమెంట్స్ జోడించి తీసిన చిత్రం 'ఘటికాచలం'. నిఖిల్ దేవాదుల హీరోగా అమర్ కామెపల్లి దర్శకత్వం వహించారు. ఒయాసిస్ ఎంటర్‌టైన్‌మెంట్ బేనర్‌పై ఎంసీ రాజు నిర్మిస్తున్నారు. దర్శకుడు మారుతి, నిర్మాత ఎస్‌కేఎన్ విడుదల చేస్తున్నారు. ఈ నెల 31న ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకొస్తోంది. శుక్రవారం ఎస్‌కేఎన్ చేతుల మీదుగా యూనిట్ ట్రైలర్‌ను ఆవిష్కరించింది. థ్రిల్లింగ్ అంశాలతో ఆద్యంతం ఉత్కంఠభరితంగా సాగే చిత్రం ఇది, థియేటర్లలోనే చూడండి అని ఎస్‌కేఎన్ కోరారు.

మ్యూజికల్ లవ్ డ్రామా



సౌమిత్‌రావు, శ్రేయాసి సేన్ జంటగా నటించిన 'నిలవే' చిత్రం పోస్టర్‌ను మేకర్స్ విడుదల చేశారు ఈ సందర్భంగా సౌమిత్ రావు మాట్లాడుతూ 'ఇది ఓ మంచి మ్యూజికల్ డ్రామా. కొత్తవాళ్లు కూడా మంచి చిత్రాలు తీస్తారు అని నిరూపించాలని మా ప్రయత్నం' అన్నారు. 'ఓ వ్యక్తి జీవితంలో జరిగే ప్రయాణమే 'నిలవే'. సంగీతాన్ని ప్రేమతో చూపించాలని అనుకున్నాం. మా సినిమాను సపోర్ట్ చేయండి అని దర్శకుడు సాయి వెన్నం కోరారు.

'బలగం' అంజన్న కన్నుమూత



బలగం సినిమాలోని అంజన్న పాత్రతో ప్రజల మనసులు గెలుచుకున్న నటుడు గుడిబోయిన బాబు అనారోగ్యంతో వరంగల్‌లోని సంరక్ష ఆస్పత్రిలో శనివారం రాత్రి ఒంటి గంటకు తుదిశ్వాస విడిచారు. రామన్నపేటలోని ఆయన నివాసంలో పలువురు నాటక, సినిమా, సాంస్కృతిక కళాకారులు, నాయకులు, స్థానికులు ఆదివారం నివాళులర్పించారు. కమెడియన్ యెల్దండి వేణు దర్శకుడిగా, దిల్ రాజు నిర్మించిన బలగం సినిమాలో హీరో ప్రియదర్శి తాతగా బాబు నటించి ఆకట్టుకున్నారు. కొంత కాలంగా కిడ్నీ సంబంధింత వ్యాధితో బాధపడుతూ ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఇప్పటి వరకు ఆయన 20కు పైగా సినిమాల్లో నటించారు.

-వరంగల్, (ఆంధ్రజ్యోతి)

ధ్యానాంజనేయ స్వామి ఉత్సవాలకు ఏర్పాట్లు

ఇచ్ఛాపురం, మే 25(ఆంధ్రజ్యోతి): పట్టణ పరిధి గొల్లవీధి సమీపంలో గల సత్యసాయి మందిరం పక్కన నూతనంగా ప్రతిష్ఠించిన ధ్యానాంజనేయ స్వామి విగ్రహ మహోత్సవాలకు ఏర్పాట్లు పూర్తి చేసినట్టు నిర్వాహకులు, జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి దాసరి రాజు తెలిపారు. 26 నుంచి మూడు రోజులపాటు ఈ ఉత్సవాలు జరుగుతాయని, సోమవారం సాయంత్రం జలయాత్ర, మంగళవారం వినాయకపూజ, స్వస్తివాచనం, బ్రహ్మణవరణ, అగ్ని ఆవాసన, సూర్యపూజ, వాస్తుపూజ, నవగ్రహ పూజ విశ్వకర్మ పూజ, బుధవారం స్వామివారికి అభిషేకాలు, సహస్రార్చన, పూర్ణాహుతి అనంతరం అన్న ప్రసాద వితరణ జరుగుతుందన్నారు. సుమారుగా 500మంది మహిళలు బిందెలతో బాహుదా నది నుండి నదీ జలాలు తీసుకొచ్చి స్వామివారికి అభిషేకాలు జరుపుతారని తెలిపారు.

కంప్యూటర్ అకౌంటెన్సీలో ఉచిత శిక్షణ

ఎచ్చెర్ల, మే 25(ఆంధ్రజ్యోతి): ఎచ్చెర్లలోని యూనియన్ బ్యాంకు స్వయం ఉపాధి శిక్షణా సంస్థలో కంప్యూటర్ అకౌంటెన్సీలో ఉచిత శిక్షణను ఈ నెల 30వ తేదీన ప్రారంభిస్తున్నట్టు సంస్థ డైరెక్టర్ రాంజీ తెలిపారు. 19 నుంచి 45 ఏళ్ల లోపు వయస్సు ఉన్న జిల్లాలోని గ్రామీణ ప్రాంత యువకులు ఈ కోర్సులో చేరేందుకు అర్హులన్నారు. 38 రోజులపాటు ఉచిత శిక్షణ ఇచ్చి, భోజన, వసతి సౌకర్యాలను కల్పిస్తామన్నారు. ఎంఎస్ ఆఫీసు, ట్యాలీ, జీఎస్టీపై శిక్షణ ఉంటుందన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు ఫోన్ నెంబర్లు 79933 40407, 95534 10809 ఫోన్ నెంబరులో సంప్రదించాలన్నారు.

సాహితీమూర్తి 'పులఖండం'


మాట్లాడుతున్న స్వామినాయుడు

శ్రీకాకుళం కల్చరల్, మే 25(ఆంధ్రజ్యోతి): డాక్టర్ పులఖండం శ్రీనివాసరావు గొప్ప సాహితీమూర్తి, స్నేహశీలని గురజాడ విద్యా సంస్థల అధినేత జీవీ స్వామినాయుడు అన్నారు. వాడాడ జంక్షన్ లోని ఓ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన పులఖండం శ్రీనివాసరావు సంస్మరణ సభలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావుతో తనకున్న అనుబంధాన్ని గుర్తుచేసు కున్నారు. వి ద్వాన్ బంకుపల్లి రమేష్ శర్మ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో రంగారావు, కేవీవీ సత్యనారాయణ, ఐక్యూ ఏసీ మా ర్ధండా కృష్ణ, రిటైర్డు డీఎస్పీ భార్గవనాయుడు పాల్గొన్నారు.

ఇంటర్ స్టేట్ బస్టాప్ ప్రారంభం


బస్టాప్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే అశోక్

కంచిలి, మే 25(ఆంధ్రజ్యోతి): ఇతర రాష్ట్రాలకు వెళ్లే ప్రయాణికుల సౌకర్యార్థం సోంపేటకు చెందిన మలిపెద్ది కుటింబీకుల ఆధ్వర్యంలో కంచిలి జాతీయ రహదారిపై నిర్మించిన కంచమ్మతల్లి ఇంటర్‌స్టేట్ బస్‌స్టాప్‌ను ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే బెందాళం అశోక్ ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇతర రాష్ట్రాలకు వెళ్లే ప్రయాణికులకు ఇది ఎంతో ఉపయోగపడుతుందన్నారు. సోంపేటకు చెందిన మల్లిపెద్ది రామారావు, సత్యనారాయణ కుమారులు బస్‌స్టాప్ నిర్మాణానికి సంబంధించిన స్థలం అందించి, నిర్మాణం చేపట్టినట్లు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు బంగారు కురయ్య, జగదీష్ పట్నాయక్, ఎంపీడీవో వి.తిరుమలరావు, సీఐ మంగరాజు, ఎస్ఐ పారినాయిడు తదితరులు పాల్గొన్నారు.

కళాకారుల సంక్షేమ సంఘం అధ్యక్షుడిగా 'పేడాడ'

ఆమదాలవలస, మే 25(ఆంధ్రజ్యోతి): కళాకారుల సంక్షేమ సంఘం నియోజకవర్గ అధ్యక్షుడిగా పేడాడ ధనుజయంరావును, ప్రధాన కార్యదర్శి బగాది తేజేశ్వరరావులను ఏకగ్రీవంగా సంఘ సభ్యులు ఎన్నుకున్నారు. పట్టణంలోని లక్ష్మీనగర్‌లోని మునిసిపల్ ప్రాథమిక పాఠశాలలో సంఘ సమావేశాన్ని కళాకారుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు టీకే త్రినాథరావు అధ్యక్షతన నిర్వహించారు. అనంతరం సంఘ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎన్నికల పర్యవేక్షకుడిగా దాస్యం లక్ష్మణరావు వ్యవహరించారు. గౌర వాధ్యక్షులుగా టీకు త్రినాథరావు, సహాధ్యక్షులుగా బొడ్డేపల్లి జనార్దనరావు, కోశాధికారిగా కొంచాడ రామారావు, ఉపాధ్యక్షులుగా దాస్యం లక్ష్మణరావు, ఎన్.చంద్రశేఖరరావు, జోగారావు, పీవీఎన్ మాస్టార్, టి.విశ్వేశ్వరరావు, ఎ.రామాచారి, సంయుక్త కార్యదర్శిగా మొబగాపు ఈశ్వరరావు, కార్యదర్శిగా కె.రాములునాయుడు, కె.సం జీవరావు, పీడీ కుమార్, ఎన్.వాసుదేవరావు, బి.గోవిందరావు, కె.భా స్కరరావు, కార్యవర్గ సభ్యులుగా పి.గోవిందరావు, ఎల్.విశ్వేశ్వరరావు, బిగోపాలరావు, పి.రాజులు, బి.దుర్గారావు, సీహెచ్ ఆదినారాయణ, టి.సత్యనారాయణ, బి.సూర్యనారాయణ, తిరుపతమ్మను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

ఆదిత్యాలయంలో మహా లింగార్చన



అరసవల్లి, మే 25 (ఆంధ్రజ్యోతి): ఆరోగ్యప్రదాత అరసవల్లి సూర్యనారాయణ స్వామివారి ఆలయ అనివెట్టి మండపంలో ప్రధాన అర్చకులు ఇప్పిలి.శంకర శర్మ ఆధ్వర్యంలో ప్రదోషకాలం, ఆదివారం మహాలింగార్చన నిర్వహించారు. ఆలయ వేదపండితులు, అర్చకులు శివ పంచాయతన సహిత మహాలింగార్చన గావించారు. ఇప్పిలి సాందీపశర్మ, దర్భముళ్ల శ్రీనివాసశర్మ తదితరులు పాల్గొన్నారు.

మృతదేహాలు అప్పగించకపోవడం అన్యాయం

శ్రీకాకుళం, మే 25(ఆంధ్రజ్యోతి): ఛత్తీస్‌గడ్ రాష్ట్రం నారాయణపూర్ ఎన్‌కౌంటర్‌లో మరణించిన మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ కార్యదర్శి నంబాల కేశవరావుతో సహా ఏపీకి చెందిన మరో ఇద్దరి మృతదేహాల్ని వారి బంధువులకు ఇప్పటికీ అప్పగించకపోవడం అన్యాయమని సీపీఐ ఎంఎల్ న్యూడెమొక్రసీ జిల్లా ప్రతినిధులు ఖండించారు. రాష్ట్ర అధికార ప్రతినిధి పి.ప్రసాద్, జిల్లా కార్యదర్శి తాండ్ర ప్రకాష్, జిల్లా సహాయ కార్యదర్శి వంకల మాధవరావు ఆదివారం ఈమేరకు ప్రకటన విడుదల చేశారు. ఏపీ హైకోర్టు ఆదేశాలను కూడా అక్కడి పోలీసులు పట్టించుకోకపోవడం శోచనీయమన్నారు. ఏపీ పోలీసు ఉన్నతాధికారుల ఒత్తిళ్ల వల్లనే అక్కడి పోలీసులు మృతదేహాల్ని ఇవ్వకుండా నిరాకరిస్తున్నట్టు అనుమానాలు వస్తున్నాయన్నారు. అంబులెన్స్ ఓనర్, డ్రైవర్‌పై శ్రీకాకుళం పోలీసు వర్గాల నుంచి నిరంతరం ఒత్తిళ్లు రావడమే దీనికి నిదర్శమని అభిప్రాయపడ్డారు. ఈ విషయంలో ఏపీ హైకోర్టు కలగజేసుకుని బాధితులకు న్యాయం చేయాలని కోరుతున్నారు.

● ఆమదాలవలస, మే 25(ఆంధ్రజ్యోతి): కమ్యూనిస్టు ఉద్యమ నేత నంబాల కేశవరావు మృతదేహాన్ని ప్రభుత్వం ఆయన కుటుంబ సభ్యులకు అప్పగించాలని రిటైర్డు తహసీల్దార్, కళింగ సంఘ నాయకులు పేడాడ జనార్దనరావు అన్నారు. ఆదివారం పురపాలక సంఘంలోని రెండో వార్డు కృష్ణాపురంలో ఆయన మాట్లాడుతూ 40 ఏళ్ల ఉద్యమ చరిత్రలో ఆయన కొనసాగారన్నారు. సమావేశంలో మాజీమున్సిపల్ చైర్మన్ కూన అప్పలనాయుడు పాల్గొన్నారు.

ఈ మలుపులు ప్రమాదాలకు పిలుపు

సరుబుజ్జిలి/గార, మే 25(ఆంధ్రజ్యోతి): అలికాం-బత్తిలి ప్రధాన రహదారి సవలాపురం జంక్షన్ వద్ద నుంచి యరగాం వరకు ఉన్న బీటీ రహదారిలో పలు చోట్ల ఉన్న మలుపులు ప్రమాదకరంగా ఉన్నాయి. మూల సవలాపురం సమీపంలో కామినాయుడు చెరువు వద్ద ఉన్న రెండు మలుపుల్లో గతంలో ప్రమాదాలు జరిగాయి. ఇదే మలుపు వద్ద గతంలో ఎదురెదురుగా వస్తున్న వాహనాన్ని గమనించని ఎంఎస్ పురం గ్రామానికి చెందిన జొన్నాడ సందేస్ అనే దివ్యాంగుడు ద్విచక్ర వాహనం అదుపు తప్పి రోడ్డు పక్కనే ఉన్న పంట పొలంలోకి దూసుకుపోయి మృతి చెందాడు. ఈ మలుపుల వద్ద ఎటువంటి హెచ్చరిక బోర్డులు లేకపోవడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. ఈ రహదారిలో సుమారు 12 చోట్ల ప్రమాదకరమైన మలుపులు ఉన్నాయి. అయి తే వాటన్నింటి కంటే ఈ రెండు మలుపులు ప్రమాదా లకు పిలుపులుగా మారడంతో ప్రయాణికులు భయాం దోళన చెందుతున్నారు.


సరుబుజ్జిలి: ప్రమాదకరంగా ఉన్న మలుపు

గార మండలంలో..

గార మండలంలో పలు గ్రామాలకు వెళ్లే రోడ్డు మలుపులు తరుచూ ప్రమాదాలకు దారితీస్తున్నాయి. ఉప్పరిపేట కల్వర్టు వద్ద, వమరవల్లి రోడ్డు కూడలి వద్ద, కొమరవానిపేట వెళ్లే రోడ్డు వాడాడ-రెడ్డిపేట రోడ్డు, శ్రీకూర్మం వెళేల రోడ్డు, కొర్ని, కొర్లాం బూరవల్లి దగ్గర మలుపులు ప్రమాదకరంగా ఉన్నాయి. తరచూ ఈ ప్రాంతాల్లో ప్రమాదాలు జరుగుతున్నాయి. ఈ మలుపులు వద్ద వేగ నిరోదకాలు, హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయక పోవడం శోచనీయం. ఈ విషయమై అర్‌అండ్‌బీ ఏఈ సీహెచ్ గోవిందరా వు మాట్లాడుతూ.. మలుపులు వద్ద అవసమైన వేగ నిరోదకాలు, హెచ్చరిక బోర్డులు ఏర్పాటు కోసం ప్రతిపాదనలు పంపించాం. అనుమతులు వచ్చిన వెంటనే ఏర్పాటు చేస్తాం.


గార: వమరవల్లి సమీపంలో ప్రమాదకరంగా..


గార: ఉప్పరిపేట కల్వర్టు వద్ద..

యోగ సాధనతో సంపూర్ణ ఆరోగ్యం


సాధన చేస్తున్న నగరవాసులు

అరసవల్లి, మే 25(ఆంధ్రజ్యోతి): యోగ సాధనతో సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమని ఆయుష్ అధికారి డాక్టర్ పి.జగదీష్ అన్నారు. నగరంలోని 80 అడుగుల రోడ్డులో యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా ఆదివారం యోగపై శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆధునిక జీవన శైలితో ప్రస్తుతం ప్రజలు అనేక మానసిక, శారీరక రుగ్మతలకు గురవుతున్నారన్నారు. యోగ, ధ్యానం సాధన చేయడం ద్వారా వీటిని దూరం చేయొచ్చన్నారు. వచ్చే నెల 21వ తేదీ వరకు యోగపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. రోజూ ఒక గంట సాధన చేయడం వల్ల ఆరోగ్యానికి ఎంతో మేలు కలుగుతుందన్నారు. ఉదయం 6.30 గంటల నుంచి 7.30 గంటల వరకు నిర్వహించిన ఈ శిక్షణలో 150 మంది వరకు పాల్గొని సాధన చేశారు. కార్యక్రమంలో మెప్మా పీడీ, సిబ్బంది, ఆయుష్ సిబ్బంది, యోగ శిక్షకులు మురళి, స్వాతి తదితరులు పాల్గొన్నారు.


యోగాసనాలు వేస్తున్న వాకర్స్‌క్లబ్ సభ్యులు

పొందూరులో..

పొందూరు, మే 25(ఆంధ్రజ్యోతి): ప్రతీరోజు యోగా సాధన ద్వారా ఆరోగ్యం పొందడమే కాకుండా మానసిక ఆనందం పొందవచ్చని డాక్టర్ సునీల్‌కుమార్, ఎంఈవో పి.రాజారావు అన్నారు. ఆయుష్ డిపార్టమెంట్ ఆధ్వర్యంలో జరుగుతున్న యోగా కార్యక్రమాల్లో భాగంగా ఆదివారం మండల కేంద్రంలో యోగపై అవగాహన కల్పించారు. స్థానిక జాలీ వాకర్స్‌క్లబ్ సభ్యులతో యోగాసనాలు వేశారు. కార్యక్రమంలో వాకర్స్‌క్లబ్ సభ్యులతో పాటు స్థానికులు పాల్గొన్నారు.

కూర్మ క్షేత్రంలో భక్తులు పూజలు


స్వామివారి దర్శనానికి క్యూలో భక్తులు

గార, మే 25(ఆంధ్రజ్యోతి): ప్రసిద్ధ శ్రీకూర్మనాథుని ఆదివారం భక్తులు దర్శించుకొని పూజలు నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు శ్వేత పుష్కరిణి స్నానాలు చేసి స్వామి వారిని దర్శించుకున్నారు. లక్ష్మీతాయారు సన్నిధి, తాబేళ్ల పార్కులను కూడా భక్తులు దర్శించుకున్నారు. ఆలయ ఈవో కె.నరసింహనాయుడు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

ఒసాకాలో నృత్య ప్రదర్శన


నృత్య ప్రదర్శనలో శ్రీకాంత్ బృందం

శ్రీకాకుళం కల్చరల్, మే 25(ఆంధ్రజ్యోతి): భారత్ పెవిలియన్ సెంటర్ ఆధ్వర్యంలో జపాన్‌లోని ఒసాకా జరుగుతున్న వరల్డ్ ఎక్స్పో-2025లో రాష్ట్రం నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న శ్రీకాంత్ శిష్య బృందం నాట్య ప్రదర్శనతో ఆకట్టుకున్నారు. ఈ కార్యక్రమానికి జపాన్, భారత్ అంబాసిడర్లు ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. శ్రీకాంత్ శిష్య బృందం ప్రదర్శనకు అక్కడకు విచ్చేసిన వారందరూ నివ్వుని తమ కరతాల ధ్వనులను అందించారు. డాక్టర్ రఘుపాత్రుని శ్రీకాంత్ శిష్యులైన శ్రీభాష్యం సుందర రామ కౌండిన్య, నేహా పట్నాయక్, గాయత్రి వర్షిత, నేహా థామస్, చాందిని, లలిత ఈ ప్రదర్శనలో పాల్గొన్నారు. రాష్ట్ర సాంస్కృతిక శాఖ, ఏపీఈడీపీ తరుపున శ్రీకాంత్ శిష్య బృందం పాల్గొన్నారు.

ఉత్సాహంగా సంబరాలు


ఊరేగింపుగా వెళ్తున్న రామయ్యపుట్టుగ వాసులు

కవిటి, మే 25(ఆంధ్రజ్యోతి): కవిటి, జగతి గ్రామాల్లోని గ్రామదేవతలకు ఆదివారం ఆయా గ్రామస్థులు సంబరాలను నిర్వహించారు. రామయ్యపుట్టుగలోని గోష్ఠి సంఘం ఆధ్వర్యంలో చింతామణి అమ్మవారికి సంబరాన్ని చేపట్టారు. జగతిలోని మర్లపోలమ్మతల్లి ఉత్సవాన్ని గ్రామస్థుల ఆధ్వర్యంలో ఘనంగా చేపట్టారు. గజముద్దలు, కాళికావేషధారణలతో సాంస్కృతిక ప్రదర్శనలతో ఊరేగింపు చేపట్టి ఆలయానికి చేరుకొని మొక్కులు తీర్చుకున్నారు.

● ఇచ్ఛాపురం, మే 25(ఆంధ్రజ్యోతి): ధనరాజ తులసమ్మతల్లి సంబరాన్ని పట్టణ పరిధిలో పలు వీధుల్లో ప్రజలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. మహిళలు అమ్మవారి ఘటాలతో ఊరేగింపుగా వెళ్లి అమ్మవారికి మొక్కులు తీర్చుకున్నారు. బిందెలతో తీసుకెళ్లిన పసుపు నీళ్లు, పానకాలతో అమ్మవారికి అభిషేకాలు జరిపించారు.

ఘనంగా శోభాయాత్ర


శోభాయాత్రలో పాల్గొన్న భక్తులు

పొందూరు, మే 25(ఆంధ్రజ్యోతి): ఆధ్యాత్మిక కార్యక్రమాలతో హైందవ ధర్మాన్ని పరిరక్షించుకోవచ్చని ఏపీ సాధుపరిషత్ అధ్యక్షుడు, ఆనందాశ్రమ పీఠాధిపతి స్వామి శ్రీని వాసానంద అన్నారు. బురిడికంచరాం గ్రామంలో నిర్మించిన 45 అడుగుల ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠా కార్యక్రమాల్లో భాగంగా ఆదివారం ఆ గ్రామం నుంచి శోభాయాత్ర నిర్వహించారు. ఈ నెల 29, 30, 31 తేదీల్లో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు తెలిపారు. 300 మంది భక్తులతో నిర్వహించిన ఈ శోభాయాత్ర గ్రామం నుంచి ప్రారంభమై ఎస్ఎం పురం, కేశవరావుపేట, సింహద్వారం, కింతలి, రాపాక, పొందూరు, గారపేట, లోలుగు గ్రామాల మీదుగా కంచరాం గ్రామం వరకు సాగింది.


ఆకట్టుకున్న నృత ప్రదర్శన

అలరించిన కూచిపూడి నృత్యం

శ్రీకాకుళం కల్చరల్, మే 25(ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళం కూచిపూడి డాన్సు అకాడమీ ఆధ్వర్యంలో బాపూజీ కళామందిర్‌లో ఆదివారం కూచిపూడి నృత్య ప్రదర్శనలు అలరించాయి. ఈ సందర్భంగా ఆ సంస్థ అధ్యక్షుడు బి.బాలకృష్ణ ఆధ్వర్యంలో కూచిపూడి నృత్య ప్రదర్శనలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న జిల్లా విద్యాశాఖ తిరుమల చైతన్య మాట్లాడుతూ.. సిక్కోలు కళలకు నిలయం అని ఎంతో సంప్రదాయబద్ధంగా చిన్నారుల నృత్య ప్రదర్శన ఆకట్టుకుందన్నారు. ఈ కార్యక్రమంలో విశాఖ నుంచి వచ్చిన కూచిపూడి నాట్య కళాశాల ప్రిన్సిపాల్ హరి రామమూర్తి మాట్లాడుతూ.. కూచిపూడి, భరతనాట్యం నృత్య ప్రదర్శనలు దేవతలకు సంబంధించినటువంటి నృత్య ప్రదర్శనలని, ఈ నృత్య ప్రదర్శనలు ప్రదర్శించడం ద్వారా గౌరవం చేకూరుస్తామని దేశానికి ఈ రెండు ప్రదర్శనలు ప్రపంచ స్థాయిలో కీర్తి తీసుకొచ్చిందన్నారు. కార్యక్రమంలో నండూరి నాగ వెంకట సత్యభాను తదితరులు మాట్లాడారు. కార్యక్రమంలో నగరానికి చెందిన శివ నృత్యనికేతన్ నృత్య దర్శకులు రఘుపాత్రుని శ్రీకాంత్, సాదిరెడ్డి హేమ సాయి, పైడి శ్రీధర్ ధర్మారావు, లక్ష్మణరావు, పాల్గొన్నారు.



రూ.2లక్షల వితరణ

జి.సిగడాం, మే 25(ఆంధ్రజ్యోతి): దవళపేట దళితవాడలో పేరంటాలు మండపం నిర్మాణానికి అదే గ్రామానికి చెందిన ప్రముఖ న్యాయవాది పేడాడ శ్రీరామ్ రెండు లక్షల రూపాయలు వితరణగా అందజేశారు. ఆదివారం పేరంటాలు మండపాన్ని ఆయన చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ సందర్భంగా శ్రీరామ్ మాట్లాడుతూ పేదలకు సాయం చేయడంతో పాటు ఇటువంటి కార్యక్రమాల్లో భాగస్వాములు కావడం చాలా సంతోషంగా ఉందన్నారు. సేవా కార్యక్రమాలు అంటే తానెప్పుడూ ముందుంటానన్నారు. సేవలో కలిగే అనుభూతి చాలా గొప్పదన్నారు. కార్యక్రమంలో స్వాతికూమార్, ఉదయ్‌కుమర్, శ్యామలరావు, రమణారావు, కృష్ణంరాజు, మురళీ, నారాయణరావు, దళిత యువకులు పాల్గొన్నారు.

గ్రీవెన్స్ వినియోగించుకోండి

శ్రీకాకుళం కలెక్టరేట్, మే 25 (ఆంధ్రజ్యోతి): స్థానిక జడ్పీ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించనున్న ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (గ్రీవెన్స్)ను సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ జిల్లా ప్రజలకు పిలుపునిచ్చారు. ఫిర్యాదుదారులు తమ అర్జీలను మీకోసం.ఏపీ.జీఓవీ.ఇన్ వెబ్‌సైట్‌లో నమోదు చేసుకోవచ్చని తెలిపారు. అలాగే అర్జీల నమోదు, ఇప్పటికే నమోదైన అర్జీల స్థితి, దానికి సంబంధించిన సమాచారాన్ని 1100కు నేరుగా కాల్ చేసి తెలుసుకోవచ్చన్నారు. అర్జీదారులు గమనించి నేడు నిర్వహించే ప్రజా ఫిర్యాదుల పరిష్కర వేదికను సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ధ్యానంతోనే ప్రశాంతత

కంచిలి, మే 25(ఆంధ్రజ్యోతి): ధ్యానంతో సంపూర్ణ ఆరోగ్యంతోపాటు మానసిక ప్రశాంతత లభిస్తుందని ప్రభుత్వ విప్ బెందాళం అశోక్ అన్నారు. పురుషోత్తపురం పంచాయతీ బురదపాడులో యోగా గురువు శాంత సదానంద స్వామితో కలసి సీతారామ పిరమిడ్ ధ్యాన కేంద్రాన్ని ఆదివారం ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ యోగా, ప్రాణాయామం, ధ్యానం మనిషి నిత్యజీవనంలో అలవరుచుకోవాలన్నారు. కార్యక్రమంలో బుద్దేపు కామేష్ రెడ్డి, పైల పురుషోత్తంరెడ్డి, గాంధీ, సరస్వతి, ధ్యానకేంద్ర నిర్వాహకులు పాల్గొన్నారు.

జ్ఞాపకశక్తిపై అవగాహన

ఆమదాలవలస, మే 25(ఆంధ్రజ్యోతి): పురపాలక సంఘం పరిధిలో 2వ వార్డు లక్ష్మడుపేటలోని మున్సిపల్ ప్రాథమిక పాఠశాలలో అద్భుత శిక్షణ అపూర్వ జ్ఞాపకశక్తిపై అంతర్జాతీయ జ్ఞాపకశక్తి ట్రైనర్ బొడ్డేపల్లి నరేష్‌కుమార్ ఆనంద ఫౌండేషన్ వారి సహకారంతో విద్యార్థులకు అవగాహన కల్పించారు. విద్యార్థులకు జ్ఞాపకశక్తి ఎలా పెంపొందించాలి అనే అంశంపై అవగాహన కల్పించారు. చదువుకొనే పదాలను ఆట వస్తువలను గుర్తించుకొలా అవగాహన చేసుకోవాలో, వారికి అర్థమయ్యే రీతిలో వివరించారు. ఫౌండేషన్ వ్యవస్థాపకులు పైడి మనోహర్ విద్యార్థులకు శిక్షణ అందించిన బ్యాంక్ ఆఫ్ ఇండియా మేనేజర్ నరేష్‌కుమార్ అభినందనలు తెలిపారు.

జంగిల్ క్లియరెన్స్ పనులు

కంచిలి, మే 25(ఆంధ్రజ్యోతి): ప్రధాన సాగునీటి చానెల్‌ల వద్ద జంగిల్ క్లీయరెన్స్ పనులను టీడీపీ నాయకుడు మాదిన రామారావు ఆదివారం ప్రారంభించారు. ఎంపీడీవో వి.తిరుమలరావు, రైతులు గోపి, దామోదరం, వజ్జ కృష్ణారావు, బొడ్డ మన్మధరావు, వెంకటరమణ, కాళిదాసు, శేషగిరి, హరి, అప్పలరాజు పాల్గొన్నారు.

పశువుల వ్యాన్లు పట్టివేత

ఎచ్చెర్ల, మే 25(ఆంధ్రజ్యోతి): అక్రమంగా తరలిస్తున్న పశువుల వ్యాన్లను నవభారత్ జంక్షన్ జాతీయ రహదారి వద్ద ఆదివారం ఎచ్చెర్ల పోలీసులు పట్టుకున్నారు. నారాయణవలస నుంచి అలమండకు తరలిస్తున్న 12 ఆవులతో ఓ వ్యాన్, 6 గేదెలతో మరో వ్యాన్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. వీటిని కొత్తవలస గోశాలకు తరలించారు. ఈ మేరకు ఎస్‌ఐ ఎస్.కృష్ణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నేరచరిత్రకు దూరంగా ఉండాలి

శ్రీకాకుళం క్రైం, మే 25(ఆంధ్రజ్యోతి): నేరచరిత్రకు రౌడీషీటర్లు దూరంగా ఉండాలని శ్రీకాకుళం వన్‌టౌన్ సీఐ పైడిపునాయుడు హెచ్చరించారు. జిల్లాలో నేర నియంత్రణ, శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా ఆదివారం వన్ టౌన్‌లో రౌడీషీటర్లకు ఎస్‌ఐ హరికృష్ణతో కలిసి సీఐ కౌన్సిలింగ్ ఇచ్చారు. చెడు అలవాట్లకు స్వస్తి చెప్పి సత్ప్రవర్తనతో మెలగాలని, ఎవరైనా వాటికి భిన్నంగా వ్యవహరిస్తే ఉపేక్షించేది లేదని సీఐ హెచ్చరించారు. ప్రజాశాంతికి భంగం కలిగిస్తే రౌడీషీటర్లపై చట్టపరమైన కేసులు నమోదు చేస్తామన్నారు. అనుమానితుల కదలికలను పోలీస్‌శాఖ ఎల్లప్పుడూ గమనిస్తూ ప్రత్యేక నిఘా ఉంచుతుందని, నేర ప్రవృత్తి విడనాడాలన్నారు.

ప్రతి ఆటోకు క్యూఆర్ కోడ్ తప్పనిసరి


క్యూఆర్ కోడ్‌పై వివరిస్తున్న పోలీసులు

పాతపట్నం, మే 25(ఆంధ్రజ్యోతి): ప్రతి ఆటోకి క్యూఆర్ కోడ్ స్టిక్కర్లు పెట్టించుకోవాలని ఎస్‌ఐ బి.లావణ్య అన్నారు. పాతపట్నం ప్రధాన రహదారులపై ఆటోలకు క్యూఆర్ కోడ్ స్టిక్కర్లను ఆదివారం అతికించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. సురక్ష అనే పోర్టల్ ద్వారా ఏర్పాటు చేసిన ఈ స్టిక్కర్‌లో ఆటోడ్రైవర్ల పూర్తి వివరాలు తెలుసుకునే అవకాశం ఉంటుందన్నారు. నేర నియంత్రణ, మహిళల భద్రతే లక్ష్యంగా వీటిని ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో పలువురు సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలను వినియోగించుకోవాలి


పశుదాణాను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే గోవిందరావు

పాతపట్నం, మే 25(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం అమలుచేస్తున్న ప్రతి పథకం రైతులకు అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే మామిడి గోవిందరావు అన్నారు. ఆదివారం క్యాంపు కార్యా లయంలో పశు సంవర్థక శాఖ ద్వారా 50శాతం రాయితీపై ఇస్తున్న పశుదాణాను పాడి రైతులకు పంపిణీ చేశారు పశుసంవర్థక శాఖ ఏడీ డాక్టర్ మంచు కరుణాకరరావు మాట్లాడుతూ.. మండలంలో 157 మంది పాడి రైతులకు పశు దాణా బస్తాలు మొదటి విడతగా అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు పైల బాబ్జి, శైలాడ సతీష్, సలాన మోహనరావు, ధనుంజయరావు, సారవకోట ఇన్‌చార్జి ఏడీ డాక్టర్ మంద లోకనాథం తదితరులు పాల్గొన్నారు.

భూసారం పెంచేందుకు నవధాన్యాలు దోహదం

పోలాకి, మే 25(ఆంధ్రజ్యోతి): అధిక దిగుబడి సాధించేందుకు వీలుగా ప్రకృతి వ్యవసాయంలో భాగంగా నవధాన్యాల సాగు చేయాలని, దీనివల్ల భూసారం పెరిగి ఎరువుగా ఉపకరిస్తుందని ఎంపీటీసీ వై.లక్ష్మణరావు అన్నారు. ఆదివారం గాతలవలస రైతు సేవా కేంద్రంలో రైతులకు ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పించారు. స్వయంశక్తి సంఘాల మహిళలకు ఆరు కిలోల వంతు ప్యాకెట్లను పంపిణీ చేశారు. ఉత్తమ రైతు అప్పలనాయుడును సత్కరించారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ పర్యవేక్షకులు సీతారాం, ప్రోత్సాహకులు ధనలక్ష్మి, సాయిలక్ష్మి, ఏవో సూర్యప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

పలు కుటుంబాలకు శివాజీ పరామర్శ


రాఘవరావుతో మాట్లాడుతున్న శివాజీ

హరిపురం, మే 25 (ఆంధ్రజ్యోతి): మందస మండలంలో ఇటీవల మృతి చెందిన, అనారోగ్యంతో బాధ పడుతున్న టీడీపీ నాయకులు, కార్యకర్తల కుటుంబ సభ్యులకు మాజీ మంత్రి గౌతు శివాజీ ఆదివారం పరామర్శించారు. హరిపురంలో అనారోగ్యంతో బాధపడుతున్న ఇప్పిలి రాఘవరావును, లక్ష్మీపురంలో దున్న సీతారాంను కలిసి యోగ క్షేమాలను అడిగి తెలు సుకున్నారు. సిగలపుట్టుగ, మర్రిపాడు గ్రామాల్లో మృతిచెందిన మురళి, లక్ష్మి కుటుంబ సభ్యులను పరామర్శించి తమ ప్రగాఢ సంతాపాన్ని వ్యక్తం చేశారు. ఆయనతోపాటు నేతలు బావన దుర్యోధన, లబ్బ రుద్రయ్య, గున్నయ్య పాల్గొన్నారు.

గిట్టుబాటు ఏదీ?

(ఐదో పేజీ తరువాయి)

చేస్తున్నారు. ఎచ్చెర్ల మండలంలోని కేశవరావుపేట జంక్షన్‌కు సమీపంలో కేంద్రాల ద్వారా కొనుగోలు చేస్తున్నారు. ఇక్కడి నుంచే సరుగుడు, నీలగిరి ఆంధ్రా, తెలంగాణ, ఒడిశా ప్రాంతాలకు సరఫరా చేసేవారు. ప్రస్తుతం ఇక్కడి నుంచి ఎగుమతులు చాలా వరకు తగ్గాయి. గతేడాది డిసెంబరులో 18 అడుగుల సరుగుడు కర్రల టన్ను రూ.9వేలకు విక్రయించేవారు. ప్రస్తుతం మిల్లర్లు ఏడు వేలకు మించి కొనుగోలు చేయడం లేదు. సరుగుడు కర్రల టన్ను రూ.6,700, నీలగిరి కర్రలు టన్ను రూ.6,800కు కొనుగోలు చేస్తున్నారని రైతులు పేర్కొంటున్నారు. వేలాది రూపాయలు వెచ్చించి.. సాగు చేయగా ఒక్కసారిగా ధర తగ్గిపోవడంతో ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నామని వాపోతున్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో కూలీల డబ్బులు కూడా గిట్టుబాటు కావడం లేదని చెబుతున్నారు. ప్రభుత్వం స్పందించి గిట్టుబాటు ధర కల్పించాలని, రైతులను ఆదుకోవాలని జిల్లా సరుగుడు, నీలగిరి రైతుల అసోసియేషన్ అధ్యక్షుడు బస్వా గురుమూర్తిరెడ్డి, తదితర రైతులు కోరుతున్నారు.

మూతపడుతున్న కాగితపు పరిశ్రమలు

క్రమేణా కాగితం వినియోగం తగ్గుతోంది. ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాల్లో కంప్యూటీకరణకు, ఆన్‌లైన్ సేవలకు ప్రాధాన్యం ఇస్తున్నారు. ఈ కారణంగా కాగితపు పరిశ్రమల మనుగడ ప్రశ్నార్థకంగా మారింది. జైపూర్ (ఒడిశా), ఏపీ రేయాన్స్ (వరంగల్), సిర్పూర్ కాగజ్‌నగర్ (తెలంగాణ) పరిశ్రమలు ఇప్పటికే మూతపడ్డాయి. జేకే పేపర్ మిల్లు (రాయఘడ), ఏపీ పేపర్ మిల్లు(రాజమండ్రి), ఐటీసీ పేపర్ మిల్లు (భద్రాచలం) మాత్రమే కొనుగోలు చేస్తోంది. దీని వల్ల కూడా మద్దతు ధర రైతులకు అందడం లేదని ట్రేడర్లు చెబుతున్నారు.

ఎన్టీఆర్ కాలనీలో తాగునీటికి ఇక్కట్లు

టెక్కలి, మే 25(ఆంధ్రజ్యోతి): మేజర్‌పంచాయతీ టెక్కలి ఎన్టీఆర్ కాలనీ నాల్గో లైన్‌లో తాగునీటికి అవస్థలు పడుతున్నారు. బోర్లు ఎండిపోగా కుళాయిల నుంచి నీటి సరఫరా కాకపోవడంతో ఇతర ప్రాంతాలకు వెళ్లి నీటిని తెచ్చుకోవాల్సి వస్తోందని స్థానిక మహిళలు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. తాగు నీటి సమస్యపై అనేక పర్యాయాలు అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా పట్టించుకోవడం లేదని మహిళలు బసవ శకుంతల, జొన్నాడ అనూరాధ, లక్ష్మి, మీనాక్షి, పార్వతి, దివ్య, బుచ్చమ్మ తదితరులు వాపోయారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు. ఈ విషయమై గ్రామీణ నీటి సరఫరా విభాగం (ఆర్‌డబ్ల్యూఎస్) ఏఈ మోహన్ వద్ద 'ఆంధ్రజ్యోతి' ప్రస్తావించగా పరిశీలించి నీటి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు.


ఎన్టీఆర్ కాలనీలో కుళాయి వద్ద నీటి కోసం వేచి ఉన్న మహిళలు (ఇన్‌సెట్‌లో) ఎండిపోయిన బావి

నిరుపయోగంగా దుకాణాలు


కూరగాయల మార్కెట్‌లో ఖాళీగా ఉన్న షాపులు

నరసన్నపేట, మే 25(ఆంధ్రజ్యోతి): లక్షలాది రూపాయల వ్యయంతో ఏర్పాటు చేసిన కూరగాయల మార్కెట్ మూన్నాళ్ల ముచ్చ టగా తయారైంది. 15 ఏళ్ల కిందట మార్కెట్ నిర్మాణం చేసినా వ్యాపారులు రోడ్లపైనే వ్యాపారాలు చేస్తుండడంతో షాపులు నిరుపయోగంగా తయారయ్యాయి. వీటిని వినియోగించకపోవడంతో శిథిలావస్థకు చేరుకుంటున్నాయి. గత ఏడేళ్లుగా వేలం వేయలేదు. దీంతో పంచాయతీకి రావాల్సిన ఆదాయాన్ని కోల్పోయింది. నిరుపయోగంగా ఉన్న మార్కెట్ మద్యం, గంజాయి అసాంఘిక కార్యకలా పాలకు నిలయంగా మారింది. కళాశాల రోడ్డు నుంచి రోడ్డుమీద వ్యాపారాలు సాగడంతో మార్కెట్‌లో వ్యాపారాలు జరగక ఈ కాంప్లెక్స్ శిథిలమైంది. తోపుడు బళ్ల వ్యాపారాలతో నిత్యం ట్రాఫిక్ సమస్య ఏర్పడు తోందని, అందువల్ల విశ్వేశ్వరయ్య కూరగాయల మార్కెట్‌ను ఆధునికీకరించి వినియోగంలోకి తీసుకువస్తే పంచాయతీకి ఆదాయం వస్తుందని పలువురు పట్టణ వాసులు కోరుతున్నారు.

ప్రమాదకరంగా ట్రాన్స్‌ఫార్మర్

కొత్తూరు, మే 25(ఆంధ్రజ్యోతి): సిరుసువాడ ఎస్సీ వీధి మధ్యలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఉండడం, స్తంభాలు బీటలువారడంతో ప్రమాదకరంగా ఉంది. ఏమాత్రం గాలి వీచినా ట్రాన్స్‌ఫార్మర్ నుంచి మంటలు చెలరేగుతున్నాయని, ఎప్పుడు ఏ ప్రమాదం సంభవిస్తుందోనని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గాలులకు విద్యుత్ తీగెలు ఊగుతూ ఒకదానికొకటి తగిలి మంటలు వ్యాపిస్తున్నాయని పేర్కొం టున్నారు. చేతికందేంత ఎత్తులో ట్రాన్స్‌ఫార్మర్ ఉండడంతో ఎటువంటి ప్రమాదాలు సంభవిస్తాయో తెలియడం లేదని వాపోతున్నారు. అటునుంచే నిత్యం రాకపోకలు సాగించాల్సి వస్తోందని, ఏమాత్రం అజాగ్రత్తగా ఉన్నా ప్రమాదాలు సంభవించే అవకాశం ఉందని ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. ఈ విషయమై ట్రాన్స్‌కో ఏఈ లక్ష్మణరావును 'ఆంధ్రజ్యోతి' వివరణ కోరగా ట్రాన్స్‌ఫార్మర్ వీధి మధ్యలో ఉండడం వాస్తవమేనని, పరిశీలించి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటామన్నారు.


ఎస్సీ వీధిలో తక్కువ ఎత్తులో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్

భారీ వాహనాలతో అవస్థలు

నరసన్నపేట, మే 25(ఆంధ్రజ్యోతి): ఇరుకు రోడ్డులోని మార్కెట్‌లోకి భారీ వాహనాలు ప్రవేశించి సరుకులను దించుతుండడంతో పట్టణ వాసులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం వరకు కాలేజీరోడ్డు, పెద్దపేట రోడ్డు మీదుగా రోజులు పది, పదిహేను భారీ వాహనాలు మార్కెట్‌లోకి ప్రవేశిస్తున్నాయి. విద్యార్థులు పాఠశాలకు వెళ్లే సమయంలో ద్విచక్ర వాహనాలు వెళ్లేందుకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రాత్రి సమ యంలోనే మాత్రమే అన్ లోడింగ్‌కి గతంలో అనుమతులుండేవని, అయితే వర్తకుల ఒత్తిళ్లతో భారీ వాహనాలను ఉదయం పూట కూడా పోలీసులు అనుమతులిచ్చినట్లు సమాచారం. పంచాయతీ కార్యాలయం, మఠం వీధి, బజారువీధి, ఆదివారంపేట, తిరుమలవీధి ప్రాంతాల్లోని ప్రజలు భారీ వాహ నాలతో నానా అవస్థలు పడుతు న్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి భారీ వాహనా లను నియంత్రించాలని స్థానికులు కోరుతున్నారు.


మార్కెట్‌లో రోడ్డు మధ్యలో నిలిపిన లారీ

వంశధారలోకి కొత్త నీరు

హిరమండలం, మే 25(ఆంధ్రజ్యోతి): వంశధార నదిలో కొత్త నీరు వచ్చి చేరుతోంది. గత కొన్ని నెలలుగా క్యాచ్‌మెంట్ ఏరియాలో వర్షాలు లేకపోవడంతో ఇన్‌ఫ్లో పూర్తిగా లేకుండా పోయింది. దీంతో గొట్టా బ్యారేజి వద్ద నీటి నిల్వ లేక వెలవెలబోయింది. ఈ నేపథ్యంలో వంశధార అధికారులు ప్రభుత్వం మంజూరు చేసిన రూ.33 లక్షలతో బ్యారేజీ గేట్ల నిర్వహణ పనులు చేపట్టారు. మూడు రోజులుగా పరీవాహక ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలకు నదిలో ఎర్రని నీరు ప్రవేశించింది. 180 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండగా వచ్చిన నీటిని సముద్రంలోకి విడిచి పెడుతున్నారు.


గొట్టాబ్యారేజీ దిగువకు విడిచిపెడుతున్న కొత్తనీరు

రద్దీ ప్రాంతాల్లో పిల్లల బాధ్యత తల్లిదండ్రులదే..

పలాస, మే 25(ఆంధ్రజ్యోతి): బస్టాండ్లు, రైల్వేస్టేషన్లు, జాతర సమయాల్లో రద్దీగా ఉండే ప్రాంతాల్లో పిల్లలను ఎట్టి పరిస్థితుల్లోనూ విడిచి పెట్ట వద్దని, వారి బాధ్యత తల్లిదండ్రులే వహించాలని బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు బీకేఆర్ పట్నా యక్ అన్నారు. స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్‌లో ఆదివారం న్యాయ విజ్ఞాన సదస్సులో భాగంగా అంతర్జాతీయ తప్పిపోయిన పిల్లల దినాన్ని నిర్వహించారు. ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ.. పిల్లల విషయంలో తల్లిదండ్రులు జాగ్రత్తలు పాటించాలని, వెట్టి చాకిరీ కోసం ఇతర దేశాలకు పిల్లలను అమ్ముకునే వారున్నారని, వారిపై అప్రమత్తంగా ఉండాలన్నారు. అటు వంటి వారు తారసపడితే సమీపంలోని పోలీస్ స్టేషన్‌కు అప్పగించాలని, లేకుంటే బాలల సంరక్షణ కేంద్రాలు, 100, 1098లకు సమాచారం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో ఏజీపీ పిండి వెంకటరావు, జాయింట్ సెక్రటరీ జీఎంఎస్ అనిల్‌రాజు, న్యాయవాదులు లోకేశ్వరరావు, దేవరాజు, అసిస్టెంట్ డిపో మేనేజర్ సంతోష్‌కుమార్, బాబూరావు, సునీల్‌కుమార్, తిరుపతిరావు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు బీకేఆర్ పట్నాయక్

నేటి నుంచి పూశాంలో ఆలయ ప్రారంభోత్సవాలు


నూతనంగా నిర్మితమైన ఉమా చంద్రమౌళీశ్వర స్వామి ఆలయం

ఎల్.ఎన్.పేట, మే 25(ఆంధ్రజ్యోతి): పూశాం గ్రామంలో నిర్మించిన ఉమా చంద్రమౌళీశ్వర స్వామి ఆలయ ప్రారంభం, లింగ ప్రతిష్ఠోత్సవాలు సోమవారం నుంచి మూడు రోజుల పాటు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. గ్రామ పురోహితుడు నేతేటి వెంకటరమణమూర్తి ఆధ్వర్యంలో వేద పండి తుడు సర్వాజ్యోస్యుల లక్ష్మీవెంకటగౌరీ వరప్రసాద్ శర్మ పర్యవేక్షణలో విశేష కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. సోమవారం దేవతా విగ్రహాల గ్రామప్రదక్షిణ, యాగశాల ప్రవేశం, మంగళవారం ప్రాతఃకాల మండపార్చన, అమ్మవారికి కుంకుమ పూజలు, బుధవారం వివిధ రకాల పూజల తోపాటు పార్వతీ పరమేశ్వరుల శాంతి కల్యాణం నిర్వహిస్తున్నామని, భక్తులు పాల్గొని స్వామి కృపకు పాత్రులు కావాలని నిర్వాహకులు, గ్రామస్థులు శివ్వాల బుజ్జి, ఎస్.శేఖర్, సుదర్శనరావు తదితరులు కోరారు.

జూన్ 6 నుంచి పెంటపోలమ్మ జాతర

కాశీబుగ్గ, మే 25(ఆంధ్రజ్యోతి): కాశీబుగ్గ పదో వార్డు పెంటవీధి-పొందరవీధిలో వెలసిన పెంట పోలమ్మ అమ్మవారి జాతర జూన్ 6వ తేదీ నుంచి 10వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు నిర్వాహక కమిటీ సభ్యులు పెంట సంజీత్, ఉమాకాంత్, విజయ్, శివ, రాజేంద్ర, కామేష్ తెలిపారు. ఆదివారం ఆలయ ఆవరణలో కమిటీ సభ్యుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. జాతర సందర్భంగా అమ్మవారి దర్శనం, అభిషేకాలు, ముర్రాటల సమర్పణ, ఘటోత్సవాలు, మొక్కుల చెల్లింపు తదితర కార్యక్రమాలు నిర్వహించనున్నామన్నారు. అలాగే వివిధ రకాల వేషధారణలు, సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయన్నారు. పలాస-కాశీబుగ్గ, పరిసర ప్రాంతాల ప్రజలు అమ్మవారిని దర్శించుకుని తరించాలని కోరారు. అనంతరం జాతర కరపత్రాలను విడుదల చేశారు. కార్యక్రమంలో పలువురు కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

గ్రంథాలయంలో సైన్స్ ఎక్స్‌పో


సైన్స్ ప్రాజెక్టులను ప్రదర్శిస్తున్న విద్యార్థులు

నందిగాం, మే 25(ఆంధ్రజ్యోతి): నందిగాం శాఖాగ్రంథాలయంలో ఆదివారం సైన్స్ ఎక్స్‌పో నిర్వహించారు. వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా సీనియర్, జూనియర్ విభాగాల్లో విద్యార్థులు తయారు చేసిన ప్రాజెక్టులను ప్రదర్శించారు. గ్రంథాలయాధికారి ఎస్.ఉదయ్‌కిరణ్ ఆధ్వర్యంలో సైన్స్ ఆవశ్యకతను వివరించారు.

ఆకట్టుకున్న వేషధారణలు

వజ్రపుకొత్తూరు, మే 25(ఆంధ్రజ్యోతి): పల్లిసారథిలో జరుగుతున్న అసిరిపోలమ్మ గ్రామ దేవత ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఉత్స వాల్లో భాగంగా కళాకారుల వేషధారణలు ఆకట్టుకు న్నాయి. 20 ఏళ్ల తరు వాత ఉత్సవాలు నిర్వహిస్తుండడంతో ఇతర ప్రాంతాల్లో ఉన్నవారు గ్రామానికి చేరుకుని సందడి చేస్తున్నారు. అనేక ప్రాంతాల నుంచి వచ్చిన కళా కారులు తమ ప్రదర్శనలి స్తున్నారు. మంగళవారం వరకు ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు గ్రామస్థులు తెలిపారు.


కళాకారుల ప్రదర్శన

న్యూస్ బాక్స్

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

పాతపట్నం, మే 25(ఆంధ్రజ్యోతి): పాతపట్నం విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని సరియాపల్లిలో సోమవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని ఏఈ జి.ప్రసాదరావు ఒక ప్రకటనలో తెలిపారు. 11 కేవీ విద్యుత్ లైన్ నిర్వహణ చేపడుతున్నందున ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్‌ను నిలుపుదల చేస్తున్నామని, వినియోగదారులు గమనించి సహకరించాలని ఆయన కోరారు.

బెల్టుషాపులు నిర్వహిస్తే చర్యలు తప్పవు

వజ్రపుకొత్తూరు, మే 25(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో మద్యం బెల్టుషాపులు నిర్వహిస్తే చర్యలు తీసుకుంటామని ఎక్సైజ్ సీఐ మల్లికార్జునరావు అన్నారు. ఆదివారం మండలంలోని పలు గ్రామాల్లో తనిఖీలు చేపట్టారు. గ్రామాల్లో సంబరాల సందర్భంగా బెల్టు షాపులు నిర్వహించే అవకాశం ఉండడంతో స్థానిక పెద్దలతో మాట్లాడారు. నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఆన్‌లైన్‌లో ఇంటిపన్ను చెల్లించేందుకు చర్యలు

నరసన్నపేట, మే 25(ఆంధ్రజ్యోతి): స్థానిక మేజర్ పంచాయతీలో గృహ యజమానులు ఇంటిపన్నులను ఆన్‌లైన్‌లో చెల్లించుకునేందుకు గాను ఆధార్, ఫోన్ నెంబరు, ఇంటి పన్ను అసెస్‌మెంట్ నెంబర్‌ను ను కార్యాలయంలో అందజేయాలని ఈవో ద్రాక్షాయిణి ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఇంటి పన్నుకు ఈ నెంబర్లను అనుసంధానం చేయాల్సి ఉందన్నారు. గృహ యాజమానులు పూర్తి వివరాలను 90328 91811 నెంబర్‌కు వాట్సాప్‌లో పంపాలన్నారు.

బీఎస్ఎన్ఎల్ సిగ్నల్ సమస్యతో అవస్థలు

నందిగాం, మే 25(ఆంధ్రజ్యోతి): మండలంలో బీఎస్ఎన్ఎల్ వినియోగదారులు సిగ్నల్ సమస్యతో ఇబ్బందులు పడుతున్నారు. ఇటు ఫోన్లు, అటు నెట్ పనిచేయక రోజుల సమాచారాన్ని ఇతర ప్రాంతాలకు ఇచ్చేందుకు ఇక్కట్లకు గురవుతున్నామని, రోజుల తరబడి ఇదే పరిస్థితి నెలకొంటోందని వారు వాపోతున్నారు. ప్రభుత్వ రంగ సంస్థ అయిన బీఎస్ఎన్ఎల్ రీచార్జ్ మొత్తాన్ని తగ్గించడంతో ఎంతో మంది వినియోగదారులుగా చేరారు. అయితే నిర్వహణలో సంబంధిత శాఖ అధికారుల నిర్లక్ష్యం వల్ల సిగ్నల్ వ్యవస్థ సక్రమంగా పని చేయడం లేదని వారంటున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు తగు చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక

హిరమండలం/కొత్తూరు, మే 25(ఆంధ్రజ్యోతి): హిరమండలం, కొత్తూరుల్లో చదువుకున్న పూర్వ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనాలు నిర్వహించారు. హిరమండలం ఉన్నత పాఠశాలలో 1983-84 సంవత్సరంలో పదో తరగతి చదివిన విద్యార్థులు, కొత్తూరు జూనియర్ కళాశాలలో 1987-88 సంవత్సరంలో పదో తరగతి చదివిన విద్యార్థులు కలుసుకుని నాటి జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. నాటి జ్ఞాపకాలు, నేటి పరిస్థితులను ఒకరికొకరు చెప్పుకుని ఆనందం పొందారు. నాటి గురువులను సత్కరించి వారి ఆశీస్సులు అందుకున్నారు. కార్యక్రమాల్లో ఆయా పాఠశాలల పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

● సోంపేట, మే 25(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలలో 1992-93 విద్యా సంవత్సరం పదో తరగతి చదివిన విద్యార్థులంతా ఆదివారం ఒక్కచోట చేరుకుని సందడిగా గడిపారు. ఈ సందర్భంగా ఒకరికొకరు అభినందనలు తెలుపుకుని, యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆనాటి ఉపాధ్యాయులు మల్లేశ్వరరావు, కామేశ్వరరావు, దుర్గారావు, అప్పలస్వామి, లక్ష్మిలను ఘనంగా సన్మానించారు.

● కవిటి, మే 25(ఆంధ్రజ్యోతి): బొరివంక జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో 2003-04 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదివిన విద్యార్థులంతా ఆదివారం ఒకచోట చేరారు. తమకు విద్యా బుద్ధులు నేర్పిన గురువులను సత్కరించి, ఒకరికొకరు యోగ క్షేమాలు అడిగి తెలుసుకున్నారు.

● బూర్జ, మే 25(ఆంధ్రజ్యోతి): బూర్జ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1992-93 సంవత్సరంలో పదో తరగతి చదువుకున్న విద్యార్థులందరూ ఆదివారం పాఠశాలలో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. నాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. హెచ్ఎం తదితరులు పాల్గొన్నారు.


హిరమండలం: ఉన్నత పాఠశాల 1983-84 విద్యార్థులు


కవిటి: బొరివంకలో కలుసుకున్న పూర్వ విద్యార్థులు


కొత్తూరు: ప్రభుత్వ కళాశాల 1987-88 పూర్వ విద్యార్థులు


సోంపేట: ఒక్కచోట చేరిన పూర్వ విద్యార్థులు